
నవంబర్ 2011
సంపుటి 5
సంచిక 7



ఎడిటర్ & పబ్లిషర్
సందిరెడ్డి కొండలరావు
కాకానిపాలెం, అద్దంకి.

Edited & Published and owned by

Kakanipalem, ADDANKI
Ph : 08593-223862
Cell : 98485 59566
e-mail : gundlakamma@yahoo.com
gundlakammas@gmail.com

and Printed at
Saswitha Graphics

Layout & Design
Real image
Ongole
Mobile : 99485 17418

# గుండ్లకమ్మ

## సామాజిక రాజకీయ మాస పత్రిక

## విషయసూచిక


| | | |
|---|---|---|
| 1. | వయస్సులో చిన్న - అభివృద్ధిలో మిన్న | 2 |
| 2. | రాష్ట్రంలో వీడని రాజకీయ అనిశ్చితి | 9 |
| 3. | సకలసమ్మె పేరుతో జరిగిన నష్టానికి బాధ్యులెవరు | 12 |
| 4. | నవ భారత నిర్మాత - జవహర్‌లాల్ నెహ్రూ | 16 |
| 5. | ఆ మూడు విశ్వవిద్యాలయాలు ఎన్టీఆర్ మానస పుత్రికలు | 19 |
| 6. | మంచి నియంత - గఢాఫీ | 20 |
| 7. | కవిత | 24 |
| 8. | సినిమా | 26 |
| 9. | పేదల సంక్షేమానికి కృషి | 28 |
| 10. | నవభారత నిర్మాణమే యు.పి.ఏ. లక్ష్యం | 29 |
| 11. | ఉదయ భానుడు రవి కుమార్ | 30 |
| 12. | ఆంజనేయస్వామి భారీ విగ్రహానికి శంఖుస్థాపన | 32 |
| 13. | అమరజీవి పొట్టి శ్రీరాములు | 33 |
| 14. | నటనారంగంలో కలికితురాయి - బండారు | 34 |
| 15. | ప్రయాణాలు మంచి చెడులు | 35 |
| 16. | తిరుక్కుఱళ్ - శ్రీవాణి | 36 |





గుండ్లకమ్మ,పాఠకలకు,
ప్రకటన కర్తలకు,
రాష్ట్ర అవతరణ దినోత్సవ శుభాకాంక్షలు....
ఎడిటర్ & పబ్లిషర్

ఇప్పుడు ప్రపంచ వ్యాప్తంగా తెలుగు పాఠకుల కోసం ఇంటర్‌నెట్‌లో
**"గుండ్లకమ్మ"**
**www.gundlakamma.com**

Owner, Published and edited by S. Kondala Rao published from Kakanipalem, Addanki - 523 201
and Printed at Saswitha Graphics, Opp. Rama Takies Street, Addanki. Editor S. Kondala Rao

# వయస్సులో చిన్న అభివృద్ధిలో మిన్న

గొట్టిపాటి రవికుమార్



ఎంతో చారిత్రక, సాంస్కృతిక, రాజకీయ ప్రాధాన్యతను సంతరించుకొన్న అద్దంకి నియోజకవర్గం నేడు అభివృద్ధి పయనం వైపు దూసుకుపోతున్నది. ప్రజా అవసరాలకు అధిక ప్రాధాన్యత ఇవ్వడం, నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండటం, ఇచ్చిన హామీల అమలుకు చిత్తశుద్ధితో కృషి చేయడం ద్వారా నియోజకవర్గ శాసనసభ్యులు గొట్టిపాటి రవికుమార్ అన్ని వర్గాల ప్రజల మనస్సుల్లో శాశ్వత ముద్రవేసుకున్నారు. వయస్సులో చిన్నవారైనప్పటికీ నియోజకవర్గ అభివృద్ధి కొరకు అభివృద్ధికి కోట్లాది రూపాయల నిధులు సమీకరించి తన ప్రత్యేకతను చాటుకొన్నారు. వివిధ శాఖల్లో వున్న నిధులపై ఆరా తీయడం ప్రతిపాదనలు పంపించి నిధుల మంజూరుకు చర్యలు చేపట్టడంలో ఆయన క్రియాశీలకంగా వ్యవహరిస్తున్నారు. ప్రతిపాదనలో వున్న పనులుగానీ, మంజూరైనవి కానీ, చేపట్టినవి కానీ పరిశీలిస్తే ఈ రెండున్నర ఏళ్ళ కాలంలో సుమారు రు.250 కోట్ల దాకా వెచ్చించేందుకు రవికుమార్ కృషి చేస్తున్నారు. తక్షణ సమస్యల పరిష్కారం కోసం ఎప్పటికప్పుడు స్పందిస్తూ నియోజకవర్గ శాశ్వతాభివృద్ధికి ఆయా రంగాలవారీగా ప్రణాళికాబద్ధంగా ముందంజవేస్తున్నారు. సాగునీరు, త్రాగునీరు, విద్యుత్, పక్కాగృహాలు, రోడ్లు, విద్య, వైద్యం, మౌళిక వసతుల కల్పనకు ప్రాధాన్యతనిస్తూ నిర్దిష్టమైన ప్రణాళికలతో మరింత అభివృద్ధే ధ్యేయంగా రవికుమార్ ముందుకు సాగుతున్నారు.

వై.యస్.రాజశేఖర్‌రెడ్డి, తండ్రి శేషగిరిరావు, పెద్దనాన్న హనుమంత రావుల ఆశీస్సులతో 2004 లో మార్టూరు నియోజకవర్గం నుండి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పోటీచేసి అత్యధిక మెజారిటీతో గెలుపొంది మార్టూరులో తొలి కాంగ్రెస్ శాసనసభ్యుడు గా చరిత్ర సాధించారు. ఆ తరువాత నియోజకవర్గ పునర్వ్యవస్థీకరణలో భాగం మార్టూరు నియోజకవర్గం రద్దయి కొంతభాగం అద్దంకి నియోజకవర్గంలో కలవడంతో 2009లో అద్దంకి నియోజకవర్గం నుండి శాసనసభ్యుడుగా గెలుపొందారు.

## రహదారుల అభివృద్ధితోనే గ్రామీణాభివృద్ధి సాధ్యం :



*రహదారుల అభివృద్ధి ద్వారానే గ్రామీణాభివృద్ధి సాధ్యమని నమ్మిన రవికుమార్ నియోజకవర్గంలోని అన్ని రహదారుల అభివృద్ధికి చక్కని ప్రణాళికను రూపొందించుకొన్నారు. అందులో భాగంగా అన్ని గ్రామీణ రహదారులను రాష్ట్ర, జాతీయ రహదారులతో అనుసంధానం చేస్తున్నారు. ప్రధాన రోడ్లన్నీ ఒక్కసారిగా తారురోడ్లగా మారబోతున్నాయి. అందుకు పంచాయతీ రాజ్, ఆర్ & బి, నాబార్డు, సెంట్రల్ రిజర్వ్ ఫండ్, జిల్లా పరిషత్, ఎం.పి. ఎమ్మెల్యే నిధులు ఒకటేమిటి అంది వచ్చిన ప్రతి అవకాశాన్ని రవికుమార్ వినియోగించు కొంటున్నారు.*

ఎంతోకాలంగా అపరిష్కృతంగా వున్న తిమ్మాయపాలెం, కొటికలపూడి రోడ్లకు రూ.2.25 కోట్లు ఆర్.బి. నిధులు మంజూరు చేయించి ఇటీవల కేంద్ర మంత్రి పనబాకలక్ష్మి చేతుల మీదుగా శంఖుస్థాపన చేయించారు. త్వరలో రోడ్డు నిర్మాణం పూర్తిగానున్నది. అదేవిధంగా ముప్పవరం రోడ్డుకు రు.70 లక్షలు, పంగులూరు - ముప్పవరం రోడ్డుకు కోటిరూపాయలు, ఆరికట్లపాలెం - ముప్పవరం రోడ్డుకు రు.70 లక్షలు, వినుకొండ - కొప్పెరపాడు రోడ్డుకు కోటి రూపాయలు, వివిధ రోడ్ల మరమ్మత్తులకు ఎఫ్.డి. ఆర్. నిధుల క్రిందు 7 కోట్ల రూపాయలకు మంజూరు చేయించారు.

పంచాయితీరాజ్ ద్వారా అద్దంకి నుండి నాగులపాడు వెళ్ళే రోడ్డుతో నల్లవాగుపై రెండు బ్రిడ్జిల నిర్మాణానికి రు.80లక్షలు, అద్దంకి పట్టణంలో కోటిరూపాయలతో సి.సి.రోడ్లు, యన్.యన్.పి.కాలువపై రు.50లక్షలతో రోడ్డు నిర్మాణం చేపట్టనున్నారు. కొమ్మినేని వారిపాలెం - వల్లాపల్లి - రాంకూరు రోడ్ల అభివృద్ధికి రు.1.50 కోట్లు, కొమ్మినేనివారిపాలెంలో 750 మీటర్ల సి.సి.రోడ్లు, గుంటుపల్లి రహదారికి రు.50లక్షలు, యర్రపాలెం రహదారికి రు.20 లక్షలు, వివిధ రోడ్ల తాత్కాలిక మరమ్మత్తులకు సుమారు 4 కోట్లు రూపాయలను మంజూరు చేయించారు. నాబార్డు సహకారంతో పంగులూరు నుండి బి. నిడమానూరు రహదారికి రు.3.80 కోట్ల పంగులూరులో 600 మీటర్ల సిమెంటు రోడ్డుకు మంజూరయ్యాయి. దైవాలరావూరు బ్రిడ్జి నిర్మాణానికి రు.2.20 కోట్లు, చెన్నుపల్లి - బల్లికురవ మధ్య బ్రిడ్జి నిర్మాణానికి రు.10 కోట్లతో ప్రతిపాదనలు పంపారు. మేదరమెట్ల బైపాస్ నుండి మేదరమెట్ల వరకు రహదారి అభివృద్ధికి రు.2 కోట్లు మొత్తం మీద రానున్న మార్చి నాటికి వివిధ శాఖల నిధులతో వివిధ రోడ్ల అభివృద్ధి చేసేందుకు రవికుమార్ ప్రయత్నిస్తున్నారు. రానున్న కాలంలో అద్దంకి నియోజకవర్గ రోడ్లన్నీ సుందర రాజమార్గాలుగా మారబోతున్నాయి.

రు.2.50 కోట్లతో కుంకుపాడు రోడ్డు నిర్మాణం, జె.పంగులూరు-పమిడిపాడు రోడ్డు రు.1.00 కోటిరూపాయలు, కొణిదెన - రాజుపాలెం సిమెంటు రోడ్డు రు.1.10 కోట్లు, పంగులూరు-నూజెళ్ళపల్లి రోడ్డు రు.1.00 కోటిరూపాయలు, బల్లికురవ-యన్.హెచ్-5 వరకు తారురోడ్డు రు.2.12 కోట్లు, జె.పంగులూరు-బి.నిడమానూరు రోడ్డుకు రు.4.50 కోట్లు, అద్దంకి-కొణికి రోడ్డు



రు.4.50 కోట్లు, మామిళ్ళపల్లి-కుందుర్రు రోడ్డుకు రు.1.00 కోటి రూపాయలు, అద్దంకి-సంతమాగులూరు రోడ్డుకు రు.2.00 కోట్లు, అద్దంకి-రేణింగవరం డబుల్‌రోడ్డుకు రు.7.5కోట్లు, నాగండ్ల-పంగులూరు రోడ్డుకు రు.2.00 కోట్లు, ముప్పవరం- ఆరికట్లవారి పాలెం రోడ్డుకు రు.1.5 కోట్లు, దైవాల రావూరు-మేదరమెట్లలో 2000 మీటర్ల సిమెంటు రోడ్డు నిర్మాణం ముఖ్యమంత్రి నిధుల నుండి రు.3.00 కోట్లతో సి.సి. రోడ్ల నిర్మాణం జరిగాయి. కేంద్రమంత్రి పనబాక లక్ష్మి, రాజ్యసభ సభ్యుడు జె.డి.శీలం, యం.పి. నిధుల ద్వారా రోడ్లు, కమ్యూనిటీ హాళ్ళు, మంచినీటి పథకాలకు అధికమొత్తంలో నిధులు రప్పించారు.

## గ్రామీణాభివృద్ధి - వ్యవసాయరంగమంటే ఆయనకు ప్రేమ :

*గ్రామీణాభివృద్ధి - వ్యవసాయ రంగమంటే రవికుమార్‌కి ఎనలేని ప్రేమ. దేశానికి వెన్నుముక అయిన గ్రామాల అభివృద్ధి పైనే దేశాభివృద్ధి ఆధారపడి ఉంటుందన్న పూజ్య బాపూజీ మాటను ఆయన శాసనసభ్యులుగా బాధ్యతలు స్వీకరించిన వెంటనే ఆచరణలో చూపడానికి నడుం బిగించారు. చెరువుల అభివృద్ధి, రక్షిత మంచినీటి పథకాలు, నీటి పారుదల, సాగర్‌కాలువల నిర్వహణ, ఎత్తిపోతల పథకాలు, ఎరువులు, విత్తనాల పంపిణీ వెరశి వ్యవసాయరంగ అభివృద్ధికి రైతు అభ్యున్నతికి అధిక నిధులు సమకూర్చుతూ రైతు భాంధవునిగా పేరుపొందారు.*

వెంపరాల, మైలవరం, ఉప్పలపాడు, రాళ్ళపాడు, కొటికలపూడి, మోదేపల్లి, ముప్పవరం మొదలైన 11 గ్రామాల్లో మంచినీటి సౌకర్యం కోసం రు.5.40 కోట్లతో ప్రతిపాదనలు సిద్ధం చేశారు. పోలిరెడ్డి ఎత్తిపోతల పథకం ద్వారా కోరిశపాడుకు మంచినీటి సౌకర్యం కల్పించేదుకు కోటి రూపాయలతో పైపు లైను నిర్మాణం జరుగనున్నది.

అన్ని గ్రామాల రైతులకు సక్రమంగా, సకాలంలో ఎరువులు, అన్నిరకాల విత్తనాలు అందేలా రవికుమార్ స్వయంగా పర్యవేక్షణ చేసి చర్యలు తీసుకొన్నారు.

అదేవిధంగా సాగర్‌కాలువల రిపేర్లు, ఇటీవల లైలా తుఫానులో తెగిపోయిన వ్యవసాయ చెరువుగట్లను వెంటనే యుద్ధప్రాతిపదికపై పూడ్పించారు.

నాగార్జునసాగర్ చివరి భూములకు నీరందించేందుకు స్వయంగా కాలువ గట్లపై



నడిచి రైతులతో మాట్లాడి నీటి సరఫరా ఇబ్బందులు తెలుసుకొని సమస్యల పరిష్కారం కొరకు కృషి చేస్తున్నారు. సాగర్ అధికారులు జెఇలు, డిఇలు, ఎస్.ఇని ఇతర అధికారులను వెంటబెట్టుకొని బొల్లాపల్లి నుండి గుంటూరు జిల్లాలోని 0 మైలురాయి వద్దకు కాలువలపై ప్రయాణించి అటు గుంటూరు జిల్లా కలెక్టర్, సాగర్ అధికారులు, చీఫ్ ఇంజనీరుతో ఫోనులో మాట్లాడి మనకు రావలసిన నీటి వాటాను విడుదల చేయించి రైతులకు ఎలాంటి నీటి ఇబ్బందులు లేకుండా చూస్తున్నారు. ప్రతినిత్యం నిద్ర లేచిన వెంటనే ఆ రోజు కాలువల నీటి మట్టాలను గురించి రైతులు, అధికారులను అడిగి తెలుసుకొని ఏ మాత్రం సమస్య వున్నా వెంటనే చర్యలు తీసుకొంటున్నారు. కేవలం ప్రకటనలకు, ప్రచారానికి ప్రాధాన్యత నివ్వకుండా చివరి రైతు పొలం వరకు నీరు అందించాలనే లక్ష్యంతో నిరంతరం రవికుమార్ పనిచేస్తున్నారు.

## విద్యారంగం :

**విద్యాధికుడైన రవికుమార్ ఉద్యోగాన్ని కోరుకొనివుంటే ప్రస్తుతం ఆయన అమెరికాలో ఏదో ఒక కంపెనీలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగిగా వుండివుండేవారు. కానీ అద్దంకి నియోజకవర్గ ప్రజలు ఆయనకు రుణపడి ఉండాలని రాసివుందో ఏమోకానీ అందుకు భిన్నంగా రవికుమార్ అద్దంకి నియోజవకర్గ ప్రజాప్రతినిధిగా వచ్చారు. విద్యలేనిదే ఎంత అభివృద్ధి చేసినా నిరర్ధకమని భావించి విద్యారంగం అభివృద్ధికి విశేష కృషి చేస్తున్నారు.**

అద్దంకి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలను మంజూరు చేయించారు. రాజీవ్ విద్యామిషన్, సర్వశిక్షా అభియాన్ ద్వారా 7 ఉన్నత పాఠశాలల అభివృద్ధికి ఒక్కొక్క పాఠశాలకు 30 లక్షల రూపాయలు మంజూరు చేయించారు. మేదరమెట్ల, కొండమంజులూరు, తిమ్మాయపాలెం, అలవలపాడు, శంఖవరప్పాడు, సంతమాగులూరు పాఠశాలల్లో రు.2 కోట్లతో 50 అదనపు తరగతి గదులను నిర్మిస్తున్నారు. ప్రతి 3 గ్రామాలకు ఒక హైస్కూలు వుండాలనే లక్ష్యంగా పనిచేస్తున్నారు. సంతమాగులూరు, బల్లికురవ గ్రామల్లో రెండు మోడల్ స్కూళ్ళను ఏర్పాటుచేయనున్నారు. అందులో భాగంగా సంతమాగులూరులో 5 ఎకరాల స్థలాన్ని కూడా సమకూర్చారు.

రాజీవ్ విద్యామిషన్ ద్వారా నియోజకవర్గంలో 2010-11 సంIIలో రు.3.04 కోట్లతో 76 పాఠశాల అదనపు తరగతిగదులు, 2011-12 సంIIలో 14.35 కోట్లతో 110 పాఠశాలల అదనపు తరగతి గదులు మంజూరు చేయించారు. పాఠశాలల్లో బాలికలకు 14.35 లక్షలతో 41 మరుగుదొడ్లు మంజూరు చేయించారు. సంతమాగులూరులో 1.25 కోట్లతో నూతన కస్తూరిభా బాలికా విద్యాస్కూలును మంజూరు చేయించారు.



## విద్యుత్‌రంగం :

ఇప్పటివరకు అద్దంకిలో కరెంటు డి.ఇ. కార్యాలయం లేకపోవడంతో రైతులు, వినియోగదారులు తీవ్ర ఇబ్బందులకు గురిఅవుతున్నారు. ఈ విషయాన్ని గమనించిన రవికుమార్ ఉన్నతాధికారులతో మాట్లాడి వెంటనే అద్దంకిలో డి.ఇ. కార్యాలయాన్ని చీరాల నుండి రప్పించారు. ఇటీవలే కార్యాలయాన్ని కూడా ప్రారంభించారు. డి.ఇ. కార్యాలయం కోసం జిల్లాలోని ఎంతోమంది ప్రజాప్రతినిధులు గత 20 ఏళ్ళుగా ఎదురుచూస్తూనే ఉన్నారు. అన్నీ ఎత్తిపోతల పథకాలకు 16 గంటల విద్యుత్ సరఫరా జరిగేలా చర్యలుతీసుకున్నారు. అద్దంకిలో 15 కోట్లతో నిర్మించే 130 సబ్ స్టేషన్ నిర్మాణం కొరకు స్థలసేకరణ జరుగుతున్నది. అంతేకాకుండా కుంకుపాడు, దక్షిణ అద్దంకి లో 33/11 సబ్ స్టేషన్‌లు మంజూరు చేయించారు, సాధునగర్, కొరిశపాడు, వల్లావల్లిలలో 33/11 సబ్‌స్టేషన్‌ల మంజూరుకు కృషిచేస్తున్నారు. వ్యవసాయ విద్యుత్ వినియోగదారులకు ఎప్పుడు ఏ సమస్య ఎదురైనా వెంటనే అధికారులతో మాట్లాడి తగు చర్యలు తీసుకొంటున్నారు. ఇప్పటివరకు షుమారు 30 కోట్లతో ట్రాన్స్‌ఫార్మర్‌లు, పోల్స్, సర్వీస్ కండక్టర్‌లకు నిధులు మంజూరుచేయించారు.

## బాధితులకు సత్వర న్యాయం - ప్రజలతో మమైక్యం :

***ఇటీవల కాలంలో ప్రజలతో మమైక్యమైన ప్రజాప్రతినిధుల్లో రవికుమార్ ముందువరుసలో వున్నారు. నిరంతరం నియోజకవర్గంలో పర్యటిస్తూ సమస్యలు తెలుసుకొని ప్రజాప్రతినిధులు, అధికారులను సమన్వయపరచి వాటి పరిష్కారానికి కృషి చేస్తూ నిరంతరం ప్రజలకు అందుబాటులో వుంటున్నారు. ప్రజల ఎవరైనా, ఏ సమయంలో ఫోను చేసినా కూడా వెంటనే స్పందిస్తున్నారు. ప్రజలు, పార్టీ కార్యకర్తలకు ఏ ఆపద వచ్చినా స్వయంగా వారి ఇళ్ళకు వెళ్ళి పరామర్శిస్తున్నారు.***

గత సంవత్సరం కుండపోత వర్షంతో అద్దంకిని అతలాకుతలం చేసిన లైలా తుఫాను వలన నష్టపోయిన బాధితులను ఆదుకోవడంలో రవికుమార్ శక్తివంచన లేని కృషి చేసి ప్రజల ప్రశంసలను అందుకొన్నారు. పట్టణంలో కుండపోత వర్షంలోనే స్థానిక ప్రజా ప్రతినిధులు, అధికారులతో కలసి అన్ని లోతట్టు ప్రాంతాలలోనూ రవికుమార్ తిరుగుతూ ఎప్పటికప్పుడు వర్ష ఉధృతిదని గమనించి ముంపు రాకుండా నివారించడం చేసిన శ్రమ మరచిపోలేనిది. అంతేకాకుండా తుఫానులో నష్టపోయిన వారికి వెంటనే న్యాయం చేసేందుకు కలెక్టరు, జిల్లా మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి, ఇన్‌చార్జి మంత్రి శత్రుచర్ల విజయరామరాజు, ఆనం రాంనారాయణ రెడ్డి, కేంద్రమంత్రి పనబాకలక్ష్మి వంటి ఎంతో మంది అద్దంకి నియోజకవర్గానికి రప్పించి, జరిగిన నష్టాన్ని కళ్ళారా చూపించారు. సుమారు 6000 మందికి నష్టపరిహారాన్ని అందించడంలో విశేష కృషి చేశారు.

రాష్ట్ర పురపాలక శాఖామంత్రి మహిధర్ రెడ్డితో ఉన్న సాన్నిహిత్యాన్ని రవికుమార్ నియోజకవర్గ అభివృద్ధికి చక్కగా వినియోగించుకున్నారు. అద్దంకి గ్రామపంచాయతీని నగర పంచాయతీగా మార్చడంలో రవికుమార్ ఎంతో కృషిచేశారు. అంతేకాకుండా మున్సిపాలిటీ నూతనభవనాల నిర్మాణానికి నిధులుమంజూరు చేయించారు. పట్టణంలో ప్రతివల్లెలో కమ్యూనిటీ హాళ్ళనిర్మాణం జరుగుతున్నది. ఎంతోకాలంగా ఈ ప్రాంత ప్రజలు ఎదురుచూస్తూ అపరిష్కృతంగా ఉన్న ఫైర్ స్టేషన్‌ను పట్టణంలో మంజూరు చేయించడంతో విశేషకృషి చేశారు.

ఎంతోకాలంగా అపరిష్కృతంగా వున్న కొరిశపాడు ఎత్తిపోతల పథకం క్రింద భూములు కోల్పోయిన రైతుల భూపరిహార సమస్యను పరిష్కరించారు. అప్పటివరకు ఎకరాభూమికి కేవలం 1,35,000 రూపాయలు మాత్రమే ఇస్తామని అధికారులు చెపుతుండగా రవికుమార్ జోక్యం చేసుకొని జిల్లా కలెక్టర్ మరియు ఉన్నతాధికారులతో

మాట్లాడి 2,50,000 రూపాయలు చొప్పున 1300 ఎకరాలకు పరిహారం ఇప్పించిన ఘనత రవికుమార్‌కు దక్కుతుంది.





## పునరావాసం :

గుండ్లకమ్మ ప్రాజెక్టు క్రింద ముంపు గ్రామాల సమస్యలపై ఎప్పటికప్పుడు అధికారులతో ప్రత్యేక సమావేశాలు ఏర్పాటు చేయించి పూర్తి స్థాయిలో గ్రామాలకు అన్ని సౌకర్యాలు కల్పించేందుకు కృషిచేస్తున్నారు. అనమనమూరు, కొటికలపూడి, మణికేశ్వరం పునరావాస గ్రామాలకు భూసేకరణ సమస్యను నివారించేందుకు అటు ప్రభుత్వం ఇటు రైతులతో స్వయంగా మాట్లాడుతున్నారు. రాష్ట్రంలో తొలిసారిగా ముంపుగ్రామాల పునరావాసానికి దేవాదాయశాఖ భూమిని 125 ఎకరాలను ధేనువకొండ వాసులకు కేటాయించడంలో విశేష కృషి చేశారు. అంతేకాకుండా పునరావాసకాలనీ ఇళ్ళకు ఐ.ఎ.వై. ఇళ్ళను అనుసంధానం చేయడంలో సఫలీకృతులయ్యారు.

## శాసనసభలో ప్రశంసలు అందుకొన్న బుజ్జి ప్రసంగం :

రాష్ట్ర శాసనసభా సమావేశాలకు రవికుమార్ క్రమం తప్పకుండా హాజరవుతూ సభలో జరిగే చర్చలలో పాల్గొని తన అభిప్రా యాలను వెలిబుచ్చుతుంటారు. చర్చల్లో పాల్గొనే





ముందు ఆయా అంశాలపై పూర్తి సమాచారాన్ని సేకరించుకొంటారు. నియోజక వర్గ సమస్యలైన సాగర్ కాలువల చివరి భూముల నీటి సమస్య, విద్యుత్, మంచినీటి సమస్య, తదితర సమస్యల గురించి అవకాశం వచ్చిన ప్రతిసారి ప్రసంగించారు. సమస్యల పరిష్కారానికి సంబంధిత మంత్రుల నుండి లిఖిత పూర్వకంగా సమాధానాలును రాబట్టారు.

## సామాజిక న్యాయం :

గూడులేని నిరుపేదలందరికీ నివాస పట్టా అందించాలన్న ఆకాంక్షలకు అనుగుణంగా అద్దంకి నియోజకవర్గంలో ఇల్లులేని నిరుపేదలందరికీ ఇంటి పట్టా ఇచ్చేందుకు రవికుమార్ కృషి చేస్తున్నారు. సింగరకొండ వద్ద రెండువేలమందికి పట్టాలు ఇచ్చేందుకు నెలలోపు క్లియరెన్స్ తెచ్చేందుకు ప్రయత్నిస్తున్నారు. పేదబడుగు బలహీన వర్గాల వారందరికీ సామాజిక న్యాయం కల్పించేందుకు భూమిలేని నిరుపేదలకు, భూ పంపిణీ చేపట్టారు. భూమి అభివృద్ధికి ఇందిరా ప్రభ ద్వారా నిధులు మంజూరు చేయించారు. కూలీలకు ఉపాధి కల్పించేందుకు ఉపాధి హామీ పథకం ద్వారా రు.2.50 కోట్ల పనులను మంజూరు చేయించారు. అంతేకాకుండా నియోజకవర్గంలో గత 5 సం॥ల కాలం పెన్షన్లు మంజూరులో విచక్షణ వలన నష్టపోయిన 2500 మంది వృద్ధులు, వితంతులకు కొత్త పెన్షన్లు మంజూరు చేయించి రాష్ట్ర చరిత్రలో రికార్డుగా నిలిచారు రవికుమార్.




**అద్దంకి శాసనసభ్యునిగా గెలుపొందడం ఆయన రెండవ విజయమైతే యావత్ నియోజకవర్గ ప్రజల మన్ననలను శాశ్వతం చేసుకోవాలన్నది ప్రస్తుతం ఆయన లక్ష్యం. ఆ లక్ష్యంతోనే నియోజకవర్గం అభివృద్ధి కోసం నిరంతరం ఆరాట పడుతున్నారు.**

**- సందిరెడ్డి కొండలరావు,**

**ఎడిటర్, గుండ్లకమ్మ.**

# రాష్ట్రంలో వీడని రాజకీయ అనిశ్చితి

(బాషా, గుండ్లకమ్మ హైదరాబాద్ ప్రతినిధి)




***రాష్ట్ర రాజకీయాల్లో మున్నెన్నడూ లేనంత విచిత్రమైన రాజకీయ పరిస్థితి నెలకొని ఉంది. అధికారంలో ఉన్న కాంగ్రెస్, ప్రతిపక్ష టీడీపీ రెండూ గడ్డు పరిస్థితిని ఎదుర్కొంటూ ఉండటమే ఈ విచిత్రం. సాధారణంగా అధికారంలో ఉన్న పార్టీ తన విధానాలతోనో, నిర్ణయాలతోనో బలహీనపడితే ఆ మేరకు ప్రతిపక్షంలో ఉన్న పార్టీ లాభపడుతుంది. కాంగ్రెస్ పార్టీకి ప్రత్యామ్నాయం బలంగా లేని రోజుల్లో అంటేరాష్ట్రం ఏర్పడిన 1956 నుండి 1982 వరకూ అధికార పక్షమే పదే పదే అధికారంలోకి రావడం సంభవించింది. అప్పట్లో ముఖ్యమంత్రి పదవిలో ఉన్న నాయకులు మారుతూ వచ్చారు తప్పితే అధికారంలో మాత్రం కాంగ్రెస్ పార్టీయే ఉంటూ వస్తోంది. తొలి పాతికేళ్ళు కాంగ్రెస్ పార్టీకి ప్రత్యామ్నాయంగా ఏ పార్టీ కూడా ఉండేది కాదు. 1982లో సినీ నటుడు ఎన్.టి.రామారావు తెలుగుదేశం పార్టీ స్థాపించే వరకూ రాష్ట్రంలో కాంగ్రెస్ కత్తికి ఎదురులేకుండా సాగి పోయింది. టీడీపీ ఆవిర్భావం తరువాత అధికారపక్షం బలహీనపడితే ప్రతిపక్షం బలం పుంజుకోవడం, ప్రతిపక్షం తప్పులుచేస్తే అధికారపక్షమే మళ్లీ అధికారంలో కొనసాగడం జరుగుతూ వచ్చింది. అయితే ప్రస్తుత రాజకీయ పరిస్థితులు వై.యస్.రాజశేఖరరెడ్డి మరణించిన తరువాత అందుకు పూర్తి భిన్నంగా తయారయ్యాయి.***

ముఖ్యమంత్రి నల్లారి కిరణ్‌కుమార్ రెడ్డి నేతృత్వంలో రాజ్యమేలుతున్న కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల్లో ప్రాబల్యం పూర్తిగా కోల్పోయింది. మరి ఇది సహజంగా టీడీపీకి లాభం చేకూర్చాలి కదా, అంటే ఆ పరిస్థితి ఎంత మాత్రం లేదు. అటు కాంగ్రెస్‌కూ, ఇటు టీడీపీకి ఏ మాత్రం అనుకూల వాతావరణం లేకపోవడం రెండు పార్టీలకూ ఆందోళన కలిగిస్తోంది. 2009 ఎన్నికల్లో దివంగత ముఖ్యమంత్రి వై.ఎస్. రాజశేఖర్ రెడ్డి నేతృత్వంలో రెండోసారి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చినప్పుడు ఆ పార్టీ పరిస్థితి రాష్ట్రంలో పటిష్టంగా కనిపించింది. కానీ మూడు నెలలైనా తిరక్కముందే ఆయన మరణం, కాంగ్రెస్‌నూ, రాష్ట్రాన్ని సంక్షోభంలోకి నెట్టేసింది.

వై.ఎస్.మరణించినప్పుడు టీడీపీ నేత చంద్రబాబునాయుడు తనకు ఇక ఎదురుండదనీ రాష్ట్రంలో తన స్థాయి ఉన్న నాయకుడు లేడనీ తదుపరి ప్రజాదరణ తనకే ఉంటుందనీ భావించారు. కానీ క్షేత్రస్థాయిలో పరిస్థితులు అడ్డం తిరిగాయి. వై.యస్.పై ఉన్న సానుభూతి ఆయన కుమారుడు వై.యస్.జగన్‌మోహన్ రెడ్డిని నేతగా ఎదగడానికి దోహదం చేసింది. తండ్రి మృతి చెందాక నిరాశతో జగన్ ఇంట్లో కూర్చోకుండా తనదైన శైలిలో రాష్ట్రంలో ముఖ్యమంత్రి పదవికి అన్ని విధాలా తనకు అర్హతలున్నాయని అధిష్ఠానానికి తెలిసి వచ్చేలా చేశారు. కానీ జగన్ అధిష్ఠానం పూర్తిగా నిర్లక్ష్యం చేయడంతో పులివెందుల ఎమ్మెల్యే అయిన తన తల్లి వై.యస్. విజయలక్ష్మితో సహా పార్టీ నుంచి నిష్క్రమించి కొత్తపార్టీని స్థాపించారు. కొత్త పార్టీ స్థాపించిన నాటి నుంచీ జగన్ విశేష జనాదరణను పొందుతూ వచ్చారు.తన తండ్రి మృతి చెందాక గుండె ఆగి మరణించిన కుటుంబాలను ఓదారుస్తానని ప్రారంభించిన ఓదార్పు యాత్రను ఎన్ని ఒడిదుడుకులు ఎదురైనా ఆపకుండా ముందుకుపోతున్నారు. అదేఆయనకు ఇప్పుడు వరమైంది.

ఇప్పటికీ ఆయన కోస్తా, రాయలసీమ జిల్లాలన్నింటినీ పర్యటించారు. ఇక చిత్తూరు జిల్లా ఒక్కటే మిగిలి ఉంది. అది పూర్తయిన తరువాత తెలంగాణలో ఓదార్పు చేయాలని సంకల్పించారు. బహుశా తెలంగాణ యాత్ర

కూడామరో ఆరు నెలల్లోనో లేదా 2012 సంవత్సరం ఆఖరు నాటికి పూర్తి కావచ్చు. ఓదార్పు యాత్రకే పరిమితం కాకుండా జగన్ ప్రజా సమస్యలపై దీక్షలు, ఆందోళనలూ, నిరసనలు చేసి ప్రతిపక్షం మార్కులు కూడా ఆయనే కొట్టేశారు. దాంతో చంద్రబాబు ప్రతిష్ఠ ఒక్క అంగుళం కూడా పెరగని పరిస్థితిని తెచ్చిపెట్టింది. పైగా బలహీనంగా ఉన్న ప్రభుత్వాన్ని కూల్చడంలో చంద్రబాబు చూపిస్తున్న అనాసక్తి ఆయనపై అనుమానాలు ప్రబలే పరిస్థితిని తెచ్చి పెట్టింది. రాష్ట్రంలో అధికార, ప్రతిపక్షాలు వేర్వేరుగా లేవు. రెండూ పరస్పరం సహకరించుకుంటున్నాయనే బలమైన భావన ప్రజల్లో నెలకొంది. ఇది అధికారపక్షానికి అంత ప్రమాదకరమైన సంకేతం కాదు గానీ, ప్రతిపక్షానికి మాత్రం చావుకబురే.



ఈ భావనను ప్రజల్లో రేకెత్తించడంలో జగన్ సఫలీకృతం అయ్యారు. కిరణ్ ప్రభుత్వాన్ని పడగొట్టే సత్తా తనకు లేదని తెలిసో, తెలియకో ముందు జగన్ ఈ ప్రభుత్వం తాను తల్చుకుంటే కూలిపోతుందని ప్రగల్భాలు పలికారు. జగన్ వెంట తొలి నుంచీ పట్టుమని 30 మంది ఎమ్మెల్యేలు కంటే మించి లేరు. ఒక దశలో సుమారు 50 మంది వరకూ ఉన్నా క్రమంగా అధికార పార్టీ ప్రలోభాలు, ఇతర కారణాల వల్ల ఆ సంఖ్య తగ్గింది. జగన్ నుంచి ఎమ్మెల్యేలను విడదీయడంలో కిరణ్ సఫలీకృతం అయ్యారుతప్పితే జనాన్ని మాత్రం జగన్ నుంచి వేరు చేయలేకపోతున్నారు. ఇదే ఇప్పుడు టీడీపీ ఆయనకు మద్దతునిస్తున్న మీడియాకు మింగుడు పడకుండా తయారైంది.

వై.ఎస్. మరణం తరువాత కాంగ్రెస్ అధిష్ఠానవర్గం జగన్ బెడద (ముఖ్యమంత్రి కావాలన్న డిమాండ్) ను తొలగించుకోవడానికి తెలంగాణ అంశాన్ని తెరమీదకు తెచ్చింది. ఏ పక్షంలోఈ అంశాన్ని కాంగ్రెస్ ముట్టుకుందో అప్పటి నుండి తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ పరిస్థితి పూర్తిగా దిగజారిపోయింది. ప్రస్తుతం

కాంగ్రెస్ తాను పెట్టిన చిచ్చుకే తాను మసైపోయే పరిస్థితి ఏర్పడింది. ఎన్నికల్లో తెలంగాణలో కాంగ్రెస్‌కు అరడజను సీట్లు కూడా రాని పరిస్థితి ఉంది. కేంద్ర హోంమంత్రి పి.చిదంబరం 2009 డిసెంబరు 9న ఇచ్చిన ప్రకటన దరిమిలా ఉవ్వెత్తున ఎగసిపడిన తెలంగాణ ఆకాంక్ష ఇప్పటికీ చల్లారలేదు. సకలజనుల సమ్మెను ముగించామని పాలకులు చంకలు గుద్దుకున్నా ఈ ప్రాంత ప్రజలు మాత్రం అదనుకోసం ఎదురుచూస్తున్నారు. ఎప్పుడు ఎన్నికలు జరిగినా తెలంగాణ వ్యవహారంలో ముందు భాగాన ఉన్న టీఆర్ఎస్ లాభపడుతుందనే అంచనాలు ఎల్లెడలా వ్యక్తం అవుతున్నాయి. టీడీపీ, కాంగ్రెస్ పార్టీలకు తెలంగాణలో నూకలు చెల్లే పరిస్థితి ఏర్పడింది. తెలంగాణ ప్రజల్లో టీఆర్ఎస్ ఆదరణ అగ్రభాగాన ఉంటే ఆ తరువాత స్థానాల్లో వైఎస్సార్, కాంగ్రెస్, టీడీపీ, కాంగ్రెస్ పార్టీలు ఉన్నాయి. ఇక కోస్తా, రాయలసీమ ప్రాంతాలకు వస్తే వైఎస్సార్ కాంగ్రెస్‌కు అనుకూల వాతావరణం నెలకొని ఉంది. వై.ఎస్ మరణం తరువాత ఇప్పటికీ వివిధ సంస్థలు అనేకసర్వేలు నిర్వహించాయి. అన్ని సర్వేల్లోనూ ప్రజాదరణలో జగన్ నెంబర్ ఒన్ స్థానంలో నిలుస్తున్నారనేది వెల్లడైంది.

రెండోస్థానంలో ఉన్న చంద్రబాబు నాయుడు బాగా వెనుకబడి ఉన్నారు. ఇక ముఖ్యమంత్రి నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి, పీఆర్పీ



నుంచి కాంగ్రెస్‌లో విలీనం అయిన కె.చిరంజీవి ఆదరణ విషయంలో సోదిలోకి కూడా లేదు. ఈ ప్రాంతంలో జగన్ తరువాత చంద్రబాబు బాగా వెనుకబడి ఉన్నారనేది స్పష్టం అవుతుంది ప్రతి పది మంది ఓటర్లలో సగటున ఆరుగురు జగన్ తరువాత ముఖ్యమంత్రి కావాలని భావిస్తూ ఉంటే చంద్రబాబుకు ముగ్గురు కూడా అనుకూలంగా చెప్పడం లేదనేది సుస్పష్టం అయిందనేది అనేక సర్వేలు తేల్చాయి. ఈ సర్వే లెక్కలు రాష్ట్రంలో ఉన్న ప్రభుత్వం నుంచీ కేంద్రంలో ఉన్న కాంగ్రెస్ అధిష్టానవర్గానికి కూడా తెలుసు. అంతేకాదు, రాష్ట్రంలో ఉన్న చంద్రబాబుకు కూడా ఈ విషయం బాగా ఎరుకే. అందుకే ఆయన పడరాని పాట్లు పడుతున్నారు. అధికారపక్షం ప్రజాదరణ కోల్పోయిన విషయం తెలుస్తున్నపుడు తక్షణం ఎన్నికలు జరిగితే తాను అధికారంలోకి రావచ్చని చంద్రబాబు భావించాలి. ఎన్నికల దిశగా పావులు కదపాలి.

ఇక్కడ తనకూ ప్రజాదరణ లేదనే విషయం తెలిసి ఎన్నికలకు వెళ్లాలంటే అధికారపక్షంతో పాటు ఆయన కూడా భీతిల్లుతున్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో ఏదో ఒక ప్రభుత్వం అధికారంలో కొనసాగాల్సిన అవసరం అధికారపక్షం కంటే చంద్రబాబుకే ఎక్కువ అవసరంగా ఉంది. ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీ నాయకులెవ్వరికీ, ఎమ్మెల్యేలతో సహా ఎన్నికలు జరిగితే ఎట్టి పరిస్థితుల్లోనూ తిరిగి అధికారంలోకి వస్తామనేనమ్మకం లేదు. అయితే అధికారం ఉన్నన్నాళ్లు ఉండి సొమ్ము చేసుకుని దిగి పోదామనే ఆలోచనలే మంత్రుల్లోను, ఎమ్మెల్యేల్లోనూ కనిపిస్తోంది.

కాంగ్రెస్‌లోని వందకుపైగా ఎమ్మెల్యేలు ఏ సాకుతో పార్టీలో నుంచి జారుకుందామా అని ఎదురు చూస్తున్నారు. తొలి విడతగా జగన్ పక్షాన చేరిన 30 మంది ఎమ్మెల్యేల పరిస్థితి వారి నియోజకవర్గాల్లో బాగుంది తప్పితే ఇప్పటికీ కాంగ్రెస్‌నే అంటి పెట్టుకుని ఉన్న ఎమ్మెల్యేలు మాత్రం చాలా కష్టాల్లో ఉన్నారు. వారిలో కొందరు ఇపుడిపుడే జగన్ వైపు చూడ్డం ప్రారంభించారు. అయితే ఇప్పటికే నిర్వహించిన అనేక సర్వేల్లో ఈ ఎమ్మెల్యేలు తమ నియోజకవర్గాల్లో ప్రతిష్ఠ కోల్పోయారనే విషయం తెలిసి జగన్ నుంచి పెద్దగా స్పందన లభించడం లేదు. ఇప్పటికీ కొద్దోగొప్పో ప్రజాదరణ ఉన్న వారినే జగన్ తన పార్టీలోకి తీసుకోవాలని చూస్తున్నారు. ఎప్పుడు ఎన్నికలు జరిగినా తెలంగాణలో టీఆర్ఎస్, కోస్తా, రాయలసీమలో వైఎస్సార్ కాంగ్రెస్ ఆధిక్యత సాధిస్తాయనే అంచనాతో ఉండటంతో అధికార, ప్రతిపక్షాలు ఎన్నికల జోలికి వెళ్ళడం లేదు. రాష్ట్రంలో మున్సిపల్, పంచాయతీరాజ్ సంస్థల గడుపు ముగిసినా వాటి పాలక వర్గాలకు ఇప్పటి వరకూ ఎన్నికలు జరుపలేని స్థితిలో ఉండటానికి అదే కారణమని అంటున్నారు. చట్టపరంగా ఏదో ఒక సాకుతో వాయిదా వేయడమే తప్ప స్థానిక ఎన్నికలు రాష్ట్రంలో ఇప్పట్లో జరిగే సూచనలు కనుచూపు మేరలో కనిపించడం లేదు.

ఇలా ఎన్నికలు జరుపకుండా అధికారపక్షం ఎంత కాలం మౌనంగా ఉంటుందో చెప్పజాలని స్థితి. ప్రతిపక్షం కూడా ఎన్నికలు జరపాలని డిమాండ్ చేయకపోవడం మరీ విడ్డూరంగా ఉంది. వై.ఎస్.అధికారంలో ఉన్నప్పుడు ఒంటికాలిపై లేచి విమర్శలు గుప్పించే చంద్రబాబు అధికారపక్షం ఏ తప్పు చేసినా చూసీ చూడనట్లు ఉంటున్నారు. అడపాదడపా కిరణ్ ప్రభుత్వంపై బాబు విమర్శలు చేసినా అవిశ్వాసం పెట్టడానికి మాత్రం ముందుకు రాకపోవడం చూస్తే ఆయన ఎటూ పాలుపోని స్థితిలో ఉన్నారనిపిస్తోంది. మరో నెల రోజుల్లో అంటే డిసెంబరు 3వ తేదీకి ముందే అసెంబ్లీ సమావేశాలు జరగాల్సి ఉంది. ఆరు నెలల వ్యవధి ముగుస్తోంది. కనుక రాజ్యాంగ పరంగా జరిపి తీరాలి కనుక సమావేశం తప్పనిసరి. ఈ సమావేశాల్లో బాబు తనపై పెరుగుతున్న ఒత్తిడికి అంగీకరించి అవిశ్వాసం పెడతారా? లేదా? ఒక వేళ అవిశ్వాసం పెడితే ఏమవుతుంది? వైఎస్సార్ కాంగ్రెస్, టీఆర్ఎస్ ఎమ్మెల్యేలు ప్రభుత్వాన్ని వ్యతిరేకిస్తే ఏమవుతుంది? అనే ప్రశ్నలకు సమాధానాలు అసెంబ్లీ సమావేశాల్లోనే తేలాల్సి ఉంది.

❋ ❋ ❋ ❋

రాష్ట్రీయం

# 'సకల సమ్మె' పేరుతో జరిగిన నష్టానికి బాధ్యులెవరు?

**ఇలపావులూరి మురళీమోహనరావు**
హైదరాబాద్, సెల్ : 98661 94944

***"తెలంగాణ వచ్చేదాకా ఉద్యోగాలు చేసేది లేదు. ప్రాణాలు పోయినా సరే, తెలంగాణ సాధన మా లక్ష్యం. జీతాలు రాకపోయినా, జైళ్ళలో పెట్టినా లెక్క చెయ్యం" తెలంగాణ రాష్ట్ర సమితి పార్టీ రాజకీయ ఎజెండాను నెత్తికెత్తుకొని, రాష్ట్ర పరిపాలనను అతలాకుతలం చేసిన 'సకల జనుల సమ్మె'కు సారథ్యం వహించిన తెలంగాణ ఎన్జీవో సంఘనాయకుడు స్వామిగౌడ్ - సమ్మె ప్రారంభానికి ముందు చేసిన ప్రకటన అది. రాజకీయనాయకుల పదవీ వ్యామోహ క్రీడకు ఉద్యోగ వర్గాలనే కాక, రాష్ట్రాభివృద్ధినే బలి చేసిన స్వామి గౌడ్‌కు నలభై రెండు రోజుల సమ్మె తరువాత ఢిల్లీస్థాయిలో రాజకీయ నాయకులు కుమ్మక్కై తమ స్వీయ ప్రయోజనాలను సాధించుకున్న విషయాన్ని గ్రహించి దిగ్భ్రాంతుడై 'తెలంగాణ ఉద్యోగులకు తెలంగాణను తెచ్చే శక్తిలేదు. అని ఆక్రోశించాల్సిన దుస్థితి కలిగింది.***

అంతేకాదు "రాజకీయ నాయకులు ఉద్యోగులను ముందుకు తోసి, తాము మాత్రం ఉదయం వేళ ఒక గంటపాటు ధర్నా చేసి, మధ్యాహ్నం నుంచీ తమ వ్యాపారాలను నిరాటంకంగా కొనసాగించుకుంటున్నారన్న జ్ఞానోదయం కూడా కలిగింది. 'పోలీసులు కాల్పులు జరిగితే మొదటి బుల్లెట్ నా గుండెలోనే దిగుతుంది. అని మేకపోతు గర్జనలు చేసిన కేశవరావు వంటి మీద వెంట్రుకకూడా రాలలేదు. ఉద్యోగులు మాత్రం కేసుల్లో ఇరుక్కున్నారు. రాజకీయనాయకులకు చెందిన బస్సులు - నిస్సహాయ ప్రయాణీకుల నుంచి మూడింతల చార్జీలు వసూలు చేసి నిర్భయంగా తిరిగాయి. సినిమా హాళ్ళు నిర్విరామంగా పనిచేసి కలెక్షన్ల వర్షాన్ని కురిపించుకున్నాయి. రాజకీయ నాయకులకు చెందిన మద్యం షాపులు, బార్లు వందల కోట్లను కళ్ళజూశాయి. అదే సమయంలో ఉద్యోగుల పిల్లాపాపలు దసరా పండక్కు కొత్త బట్టలు లేవని వెక్కి వెక్కి ఏడ్చారు. దీపావళికి ఇంట్లో చిన్న కాకరపువ్వొత్తి




కూడా కాల్చలేకపోయామని రోధించారు. నెల జీతగాళ్ళకు రాష్ట్రాన్ని తెచ్చే శక్తి ఉండదని స్వామిగౌడ్ మొదటే గ్రహించినట్లయితే రాష్ట్ర అభివృద్ధి కుంటుపడేది కాదు.

## సామాన్యులే బలిపశువులు :

రాజకీయనాయకులకు అధికారమే పరమావధి. దాన్ని సాధించుకోవడానికి ఎంతమందినైనా బలి ఇవ్వడానికి వారు వెనుకాడరు. ప్రజాక్షేమం వారి స్వార్థం ముందు ఎప్పుడూ ఓడిపోతుంది. తాము పోరాడి, త్యాగాలుచేసి సాధించవలసిన దాన్ని సాధించలేక అమాయకులను బలిచేయడం వారికి వెన్నతో పెట్టిన విద్య. అందుకే తెలంగాణ ప్రాంతానికి చెందిన ఉద్యోగులను రెచ్చగొట్టారు. ఉద్యోగ సంఘాల నాయకులకు తెలంగాణ వచ్చిన తరువాత రాజకీయ పదవులిస్తామని ఆశలు కల్పించారు. సంఘాల నాయకులకు ఆర్థికంగా అంతో ఇంతో బలముంటుంది. అవసరమైతే తమను వాడుకుంటున్న నాయకుల నుంచి ధనాన్ని స్వీకరిస్తారు. పైగా ఉద్యోగులకు భద్రత ఉంటుంది. అందువల్లనే వారు ప్రతిపక్ష నాయకుల రాజకీయ అజెండాను మోసేందుకు సిద్ధపడ్డారు. అయితే తెలంగాణ ఇవ్వాల్సిన కేంద్ర ప్రభుత్వం అందుకు సిద్ధంగా లేకపోవడంతో, నలభై రెండు రోజులు సమ్మె చేసినా రాష్ట్ర కేంద్ర ప్రభుత్వాలలో చలనం లేకపోవడంతో ఉద్యోగుల కుటుంబాలలో కలకలం మొదలైంది. అప్పటికే ఆర్టీసి బస్సులు





తెలంగాణ సాధనే లక్ష్యమని, అందుకోసం ఏ త్యాగాలకైనా సిద్ధమని ప్రకటించిన ఉద్యోగులు చివరకు – సమ్మె కాలానికి తమ జీతాలిస్తే చాలునని ప్రభుత్వంతో కాళ్ళు బేరానికి దిగారు. కుక్క చెయ్యాల్సిన పని గాడిద చెయ్యాలనుకుంటే ఏం జరుగుతుందో ఉద్యోగులకు తెలిసొచ్చింది. ఇకనైనా ఉద్యోగులు రాజకీయ నాయకుల మాయమాటలకు లొంగిపోకుండా ప్రజా సేవకులుగా తమ కర్తవ్యాన్ని నిర్వర్తిస్తే బాగుంటుంది. లేకపోతే ప్రజల ఛీత్కారానికి గురికావలసి వస్తుంది. ప్రజాబలం లేని నాయకుడు ముఖ్యమంత్రి స్థానంలో ఉండటంతో ఉద్యోగుల ఆటలు సాగాయి కానీ, ఇదే సమయంలో ఎన్టీయార్, రాజశేఖర్‌రెడ్డి వంటి మాస్ లీడర్లు ముఖ్యమంత్రులు అధికారంలో ఉన్నట్లయితే ఉద్యోగులందరినీ ఒక్క కలం పోటుతో డిస్మిస్ చేసి ఉండేవారు.

లేక, పాఠశాలలు లేక, విద్యుత్ సరఫరా సరిగ్గా లేక తెలంగాణ ప్రజలలోనే ఒకరకమైన తిరుగుబాటు మొదలైంది. దానికితోడు కొన్ని స్థలాలను అక్రమంగా ఆక్రమించారని స్వామిగౌడ్ మీద ఆరోపణలు రావడం ఉద్యమ నాయకుల నైతికతను దెబ్బతీసింది. ఉద్యోగులలో తొంభైతొమ్మిదిశాతం మంది వేతనాలే ఆధారం కావడంతో చేతిలో డబ్బులాడక ఉద్యోగులు గిలగిలలాడారు. దాంతో వరుస బెట్టి సకల జనుల్లోంచి రోజుకొకరు జారిపోయారు.

ముందుగా సింగరేణి కార్మికులు, ఆ తరువాత ఆర్టీసీ కార్మికులు విధుల్లో చేరిపోవడంతో ప్రజాజీవనాన్ని స్తంభింపచేసిన రెండు వ్యవస్థలు గాడిలోపడ్డాయి. తెలంగాణలోని నాలుగు లక్షల మంది 'సకల జనుల'లో ఏభైశాతం మంది ఈ రెండు రంగాలలోనే ఉన్నారు. వారి వెంటనే మరో లక్షమంది దాకా ఉన్న ఉపాధ్యయులు విధుల్లో చేరడంతో ఇక డిపార్ట్‌మెంట్స్‌లో పనిచేసే ఉద్యోగులు మాత్రమే ఒంటరిగా మిగిలారు. వీరు ఎన్ని సంవత్సరాలు సమ్మె చేసినా పెద్దగా ప్రభావం ఏమీ ఉండదు. అందువల్ల వీరి సమ్మెకు ప్రజామద్దతులభించలేదు. దాంతో వారు కూడా తోకముడవక తప్పలేదు.

## నష్టానికి బాధ్యులెవరు?

ఈ సమ్మెవలన రాజకీయ నాయకులకు ప్రభుత్వానికి వచ్చే నష్టం ఏమీ లేదు. సమ్మె వలన జరిగిన నష్టాన్ని పన్నులు పెంచడం ద్వారా ప్రభుత్వం రాబట్టుకుంటుంది. మరి నష్టపోయింది ఎవరు? ప్రైవేటు రవాణాను ఆశ్రయించి వేల రూపాయలను అధికంగా వెచ్చించిన సామాన్యులు, పాఠశాలలు సాగక విద్యార్జనలో వెనుకబడిన విద్యార్థులు, మానసిక వేదననుభవించిన వారి తల్లిదండ్రులు, చిరువ్యాపారులు. వీరు ఎంతక్షోభించినా ఎవరికైనా చీమకుట్టినట్లుంటుందా? వీరివి విలువలేని ప్రాణాలు మరి? విలువైన ప్రాణాలు రాజకీయ నాయకులవి. తెలంగాణకోసం ప్రాణత్యాగం చేస్తామని బీరాలు పలికే ఒక్క నాయకుడూ కనీసం ఆత్మహత్యాప్రయత్నం కూడా చెయ్యడు. 600 మంది పిల్లలు ఆత్మహత్యలు చేసుకున్నారని మొసలి కన్నీరు కార్చే కేసీఆర్, హరీష్‌రావు, కేశవరావు, హనుమంతరావు వంటి రాజకీయులు ఒక్కరు కూడా ఆత్మహత్య చేసుకోకపోవడం ఆశ్చర్యం గొలుపుతుంది. ఇప్పటికే ఎంతో జీవితాన్ని





అనుభవించిన నాయకులు మిగిలిన స్వల్పకాల జీవితాన్ని తెలంగాణకోసం త్యాగం చెయ్యలేరా? విద్యార్థులు అతి సునాయాసంగా ప్రాణాలర్పిస్తుంటే వారి మార్గంలో ఈ నాయకులెందుకు పయనించరు? బుల్లెట్లు దించుకోవడానికి సిద్ధమని ప్రగల్భాలు పలికే కేశవరావు, కోదండరాంలు రైలురోకో జరుగుతున్న రోజున గాంధీభవన్‌లో, తెలంగాణా భవనాల్లో దాక్కున్నారు? కేశవరావు గుండెల్లో బుల్లెట్ దిగుతుందేమోనని ఎంతో ఆశగా ఎదురుచూసిన తెలంగాణ తల్లి తన బిడ్డల పిరికితనానికి కన్నీరు కార్చింది. ఈ సమయంలో ఆంధ్రరాష్ట్రం ఎలా ఏర్పడిందో ఒకసారి ఈ తరం తెలంగాణ యువతరం తెలుసుకోవాల్సిన అవసరముంది.

మద్రాసు రాష్ట్రం నుంచి ఆంధ్రాను విడదీయాలని నాలుగు దశాబ్దాల పాటు ఉద్యమం నడిచింది. చివరకు పొట్టి శ్రీరాములు ఆమరణ నిరాహారదీక్షకు పూనుకున్నారు. ఆ ఆమరణదీక్ష మన లగడపాటి, కేసీఆర్‌లు చేసినటువంటి బూటకపు నిరాహారదీక్ష కాదు. ఏ విధమైన సెలైన్లు లేకుండా కేవలం మంచినీరు మాత్రమే తీసుకుంటూ చేసిన ఆ దీక్ష 56 రోజులు సాగింది. పొట్టి శ్రీరాములు నిరాహారదీక్ష విషయాన్ని నాటి ప్రధాని నెహ్రూ దృష్టికి తీసుకెళ్ళినప్పుడు ఆయన హేళనగా నవ్వి "ఒక వ్యక్తి నిరాహారదీక్షతో రాష్ట్రాలు రావు" అన్నారట. కానీ ఆ తరువాత కొద్దిరోజులకే పొట్టి శ్రీరాములు ఆంధ్రరాష్ట్రం కోసం ప్రాణాలర్పించడంతో కేంద్ర ప్రభుత్వం దిగివచ్చి ఆంధ్రరాష్ట్రాన్ని ఏర్పాటు చేసింది. కేసీఆర్ కూడా అదే పంథాలో ఆత్మత్యాగం చేయగలిగితే తెలంగాణ రాష్ట్రం ఏర్పడి తీరుతుంది. తెలంగాణ సోదరులు ఈ విషయంలో కేసీఆర్‌పై ఒత్తిడి తీసుకురావాలి. అయితే దాన్ని ఆమోదించడానికి కేసీఆర్ ఏమైనా పొట్టి శ్రీరాములు వలే సర్వసంగపరిత్యాగి, నిరుపేదకాడు కదా.


ఇప్పుడు ప్రజానీకం అడుగుతున్నది ఒకటే. గత రెండు సంవత్సరాలలో రాష్ట్రం మొత్తం ఉద్యమం మూలంగా సర్వనాశనమైంది. రాష్ట్రంలో ఏర్పాటు చెయ్యాలనుకున్న



పరిశ్రమలు ఇతర రాష్ట్రాలకు వెళ్ళిపోయాయి. విద్యుదుత్పత్తి నిలిచిపోవడంతో పంటలకు నీరందక రైతులు విపరీతంగా నష్టపోయారు. పండుగలు సరిగా జరుపులేకపోయామని తెలంగాణ ప్రజలు మానసిక క్షోభననుభవించారు. అన్నింటినీ మించి గత రెండు సంవత్సరాల కాలంలో సుమారు నాలుగు వందల మంది అమాయక నిరుపేద కుటుంబాలకు చెందిన విద్యార్థులు ఆత్మహత్యలకు పాల్పడ్డారు. 'కేసులకు జడవం' అని బీరాలు పలికే నాయకులు, ఉద్యోగులు ప్రభుత్వం కాళ్ళుపట్టుకొని కేసులు నుంచి తప్పించుకుంటూరు. కానీ ఎంతోమంది అమాయకులు కేసుల్లో ఇరుక్కొని పోలీస్ స్టేషన్లు, కోర్టుల చుట్టూ తిరుగుచున్నారు. ఏ ఉద్యమంలోనైనా అంతిమంగా బుజువయ్యే విషయం ఏంటంటే త్యాగాలు ప్రజలవైతే, భోగాలు నాయకులవి. తెలంగాణ ఉద్యమం కూడా అందుకు భిన్నం కాదు.

తెలంగాణ వచ్చినా రాకపోయినా నాయకుల సుఖాలకు ఏ లోటూ ఉండదు. ఒక ప్రయోజనం కోసం ప్రజలను ప్రేరేపించి, రెచ్చగొట్టి, ఆ ప్రయోజనాన్ని సాధించకుండానే ఉద్యమాన్ని విరమించినప్పుడు అందుకు బాధ్యులైన వారు ప్రజలకు సంజాయిషీ ఇచ్చుకోవాల్సిన అవసరముంటుంది. ఉద్యమం తీవ్రదశకు చేరుకున్న తరుణంలో కేసీఆర్ సంబంధీకులు పోలవరం టెండర్లను దక్కించుకున్నారనే ఆరోపణలు వెల్లువెత్తాయి. ఆ టెండర్ల వ్యవహారం ఫైనల్ అయిన మరునాడే ఉద్యమం హఠాత్తుగా ఆగిపోవడం కూడా ఎన్నో అనుమానాలకు తావిస్తున్నది.


ఆ విషయాన్నలా ఉంచితే, ప్రజలకు సంబంధించిన అపారనష్టానికి, నాలుగొందల మంది నిరుపేదకుటుంబాలకు చెందిన పిల్లల మరణాలకు ఎవరు బాధ్యత వహిస్తారు? తెలంగాణ విషయాన్ని ఎటూ తేల్చకుండా నాన్చుతున్న కేంద్ర ప్రభుత్వమా? ప్రజలను రెచ్చగొట్టి వాళ్ళ జీవితాలతో ఆడుకుంటున్నారు. కేసీఆర్ కోదండరామిరెడ్డిలా? తమ పార్టీది సమైక్య విధానమని తెలిసీ ప్రజాజీవితాలతో



ఆడుకుంటూ కపటనాటకాలాడుతున్న కాంగ్రెస్ పార్టీ ఎంపీలా? ఈ సందర్భంలో సుమారు డెబ్బై సంవత్సరాల క్రితం జరిగిన ఒక సంఘటనను మననం చేసుకోవాలి.

స్వాతంత్ర్య ఉద్యమం పేరుతో ప్రజలను రెచ్చగొట్టి అనేకమంది చావులకు కారణమయ్యారన్న ఆరోపణతో అహ్మదాబాద్ సెషన్స్ కోర్టులో గాంధీజీని హాజరు పరిచారు. ఆ సందర్భంగా కోర్టు హాలులో గాంధీజీ ఇచ్చిన వాఙ్మూలం ఈ విధంగా ఉంది.

"ఈనాడు భారతదేశం నలుమూలల్లో జరిగిన అల్లర్లకూ, చావులకూ, హత్యలకు, నేను స్వయంగా బాధ్యత వహిస్తున్నాను. శాసన ధిక్కార ప్రణాళికను నడుపుతున్నది నేనే. నా ఉద్యమాల కారణంగా జరిగిన, జరుగుతున్న కర్మకాండకంతటికీ నేనే కర్తను, నేనే భర్తను. అందువల్ల నేను పూర్తి శిక్షార్హుడిని. మరణ శిక్ష విధించినా ఆనందంగా స్వీకరిస్తాను. మీకు యథోచితమని తోచిన శిక్షను మీరు విధించవచ్చును" అందుకే గదా గాంధీ 'మహాత్ము'డయ్యాడు



ఏదీ! ఆ విధంగా తమ కారణంగానే అంతమంది విద్యార్థులు ఆత్మహత్య చేసుకున్నారని ఏ ఒక్క ఉద్యమనాయకుడి నైనా ధైర్యంగా ప్రకటించమనండి.

ఆ దమ్ము కేసీఆర్‌కుందా?

ఆ ధైర్యం కోదండరాంకు ఉందా?

ఆ తెగువ కాంగ్రెస్ టీ ఎంపీలకుందా?

నిలువెల్లా స్వార్థం మూర్తీభవించిన పిరికి వెధవల కోసం - తమను నమ్ముకుని గంపెడాశలతో బ్రతుకుతున్న తల్లిదండ్రులను, కుటుంబ సభ్యుల మనసులను క్షోభకు గురిచేసి ఎవరూ ఆత్మహత్యలు చేసుకోవద్దు. నాయకులను చావమనండి. వారిని రైళ్ళ కింద పడమనండి. రేపు తెలంగాణ వస్తే పదవులను పంచుకునేది వారే తప్ప మీరు కాదని ఇప్పటికైనా గ్రహించండి. రాష్ట్రం, దేశం ఎన్నటికీ దివాలా తీయవు. మీరు ఒక్కరు మరణిస్తే మీ కుటుంబం మొత్తం కోలుకోలేని దెబ్బ తింటుంది సోదరులారా...

❋ ❋ ❋ ❋


## గుండ్లకమ్మ మాస పత్రికకు చందా దారులుగా చేరాలనుకుంటున్నారా!

రాష్ట్ర వ్యాప్తంగా అత్యధిక సర్కులేషన్ కలిగి మల్టీ కలర్‌తో గ్రామీణ ప్రాంతమునుండి వెలువడుతూ, పాఠకుల విశేష ఆదరాభిమానాలు పొందుతున్న "గుండ్లకమ్మ" మాస పత్రికకు చందాదారులుగా చేరండి

ప్రతి నెల మీ ఇంటికి పోస్టు ద్వారా తెప్పించుకోండి.

**రెండు సంవత్సరముల చందా రూ.200/- లను**

**"అఖిల్ పబ్లికేషన్స్" పేరుతో డి.డి. లేదా యం.ఓ.ను**

మీ పూర్తి అడ్రస్సుతో ఈ క్రింది చిరునామాకు పంపగలరు...

**అఖిల్ పబ్లికేషన్స్, కాకాని పాలెం, అద్దంకి. ప్రకాశం జిల్లా. ఫోన్: 98485 59566**

ఇప్పుడు ప్రపంచ వ్యాప్తంగా తెలుగు పాఠకుల కోసం ఇంటర్‌నెట్‌లో


**"గుండ్లకమ్మ"**

**www.gundlakamma.com**

# నవభారత నిర్మాత - రాజకీయ పండితుడు

# జవహర్‌లాల్ నెహ్రూ (1889-1964)

రచన -
డా॥ **దగ్గుబాటి వెంకటేశ్వరరావు**, శాసనసభ్యులు
("ప్రపంచతత్త్వం - నాయకత్వం" పుస్తకం నుండి)






**బ్రిటిష్ వారు రాకముందే స్వాతంత్ర్యాన్ని కోల్పోయిన భారతదేశం బ్రిటిష్‌వారు వెళ్ళిపోయిన తర్వాత కూడా స్వాతంత్ర్య మధురిమను అనుభవించలేకపోయేవారు, జవహర్‌లాల్ నెహ్రూ మొదటి ప్రధాని కాకపోయివుంటే. నెహ్రూ అభ్యుదయ భావావేశం కలవాడు, చరిత్రజ్ఞానం పుష్కలంగా ఉన్న వాడు కావడంతో మనం పొందిన స్వాతంత్ర్యఫలాలు తియ్యగానే అనిపిస్తున్నాయి. 1947 తర్వాత అంతర్యుద్ధం తలెత్తకుండా నిరోధించి, నూతన ఆర్థిక, పారిశ్రామిక 'దేవాలయాలు' నిర్మించి సామాజిక స్థిరత్వాన్ని ప్రసాదించిన మహానాయకుడు జవహర్‌లాల్ నెహ్రూ.**

1889 నవంబర్ 14న సంపన్న కుటుంబంలో జన్మించిన నెహ్రూ బాల్యం ఆనందంగా గడిచింది. తండ్రి మోతీలాల్ నెహ్రూ అలహాబాద్‌లో న్యాయవాది. తల్లి స్వరూపరాణి. నెహ్రూకు నాణ్యమైన విద్యనందించాలని 1905లో ఇంగ్లాండుకు పంపించారు. హేరోలో కొంతకాలం, కేంబ్రిడ్జి విశ్వవిద్యాలయం ట్రినిటీ కళాశాలలో సైన్సును చదివిన నెహ్రూ 'ఇన్నర్ టెంపుల్'లో న్యాయశాస్త్రాన్ని అధ్యయనం చేసి 1912లో భారతదేశానికి తిరిగి వచ్చారు. ఐరోపాలో గడిపిన 7 సంవత్సరాల్లో పాశ్చాత్య విలువల్నీ, నాగరికత గమనాన్నీ అర్థం చేసుకున్న నెహ్రూలో కొత్త ఆలోచనలు కలుగుతున్నాయి. భారతదేశంలో రావాల్సిన మార్పుల గురించి దీర్ఘాలోచన చేసేవారు. హింసా మార్గంలో సంభవించే కమ్యూనిస్టు విప్లవానికీ, దార్శనికానికీ ప్రత్యామ్నాయంగా బ్రిటన్‌లో జార్జి బెర్నార్డ్‌షా తదితరులు ప్రతిపాదించిన



'ఫేబియన్' సోషలిజం నెహ్రూను ప్రభావితం చేసింది. 'ఐరిష్ నేషనలిజం' కూడా నెహ్రూలో ఆవేశాన్ని నింపింది.


అలహాబాద్‌కు తిరిగి వచ్చిన నెహ్రూ న్యాయవాదిగా స్థిరపడ్డారు. 1916లో 'కమల'ను వివాహం చేసుకున్నారు. వారికి కలిగిన సంతానమే ఇందిర.

అనీబిసెంట్ హోమ్‌రూల్ (స్వపరిపాలన) ఉద్యమాన్ని దేశవ్యాప్తం చేస్తున్నది. నెహ్రూ ఉద్యమంలోకి మొదటగా అడుగుపెట్టారు 1917లో. దక్షిణాఫ్రికా నుంచి తిరిగి వచ్చి కాంగ్రెస్‌లో పైకెదుగుతున్న గాంధీని మొదటిసారిగా 1919లో నెహ్రూ కలుసుకున్నారు. రౌలత్ చట్టానికి వ్యతిరేకంగా గాంధీ ఉద్యమిస్తున్న సమయమది. గాంధీకన్నా వయసులో 20 సంవత్సరాలు చిన్నవాడైన నెహ్రూలో ఉన్న పట్టుదల, క్రమశిక్షణ, స్పష్టమైన ఆలోచనలు గాంధీకి నచ్చాయి. అప్పటికి పాశ్చాత్య జీవన విధానం బాగా అలవడిన నెహ్రూను గాంధీ సాదాసీదా జీవనం పునరాలోచించేటట్టు చేసింది. నెహ్రూ కూడా ఖాదీకి మారిపోయారు. 1920-22 మధ్య గాంధీ తలపెట్టిన 'సహాయ నిరాకరణ' ఉద్యమంలో పాల్గొని అరెస్టయి కొన్ని నెలల కారాగారవాసం కూడా మొదటిసారిగా రుచిచూశారు నెహ్రూ. న్యాయవాద వృత్తికంటే

రాజకీయ వృత్తి ముఖ్యమని తోచింది నెహ్రూకు.

1924లో అలహాబాద్ మునిసిపల్ ఎన్నికల్లో నెగ్గి నగర అధికారిగా రెండు సంవత్సరాలు పనిచేసిన నెహ్రూకు భారతదేశ బ్యూరోక్రసీ (ప్రభుత్వ యంత్రాంగం) ఎంత సోమరితనంగా ఉందో తెలిసివచ్చింది. అధికారుల అవినీతితో వేగలేక 1926లో రాజీనామా చేసిన నెహ్రూ దేశ రాజకీయాల్లోకి ప్రవేశించారు. అఖిలభారత కాంగ్రెస్ కమిటీకి ప్రధాన కార్యదర్శిగా ఎన్నికై 1926 నుంచి 28 వరకు దేశంలోని ప్రముఖ నాయకులందరికీ ఆప్తుడయ్యారు. 1929లో లాహోర్‌లో జరిగిన వార్షిక కాంగ్రెస్ సమావేశాలకు అధ్యక్షత వహించి, సుభాష్ చంద్రబోస్‌తో కలసి భారతదేశానికి సంపూర్ణ స్వరాజ్యాన్ని ఇవ్వాలని బ్రిటన్‌పై ఒత్తిడి చేసేవిధంగా తీర్మానాన్ని చేశారు. కానీ కొందరు కాంగ్రెస్ సభ్యులు, తండ్రి మోతీలాల్ కూడా, బ్రిటిష్ సామ్రాజ్యంలో 'డొమినియన్' ప్రతిపత్తి సంపాదిస్తే చాలని భావించారు. కాంగ్రెస్‌లో నెహ్రూకు ప్రాధాన్యం పెరగడానికి అనేక కారణాలున్నాయి. గాంధీ ఆశీస్సులుండడం, యువకుడు, విద్యావంతుడు కావడం, చరిత్ర పరిజ్ఞానం మెండుగా ఉండడం, అన్నింటినీ మించి అందమైన రూపు కలిగివుండడం.

1931లో తండ్రి మోతీలాల్ నెహ్రూను కోల్పోయారు. ఉప్పు సత్యాగ్రహం, ఇంకా ఇతర కార్యక్రమాల్లో పాల్గొన్న నెహ్రూకు కారాగారవాసం విధించింది ప్రభుత్వం. కారాగారం నుంచి 13 సంవత్సరాల వయసున్న కుమార్తె ఇందిరకు దాదాపు 200 ఉత్తరాలు రాశారు నెహ్రూ. ఈ ఉత్తరాల్లో కుటుంబ, వ్యక్తిగత క్షేమాలుగాక ప్రపంచ నాగరికత, చరిత్ర ఉంది. నెహ్రూ ఉత్తరాలు ఇందరను విశ్వవిద్యాలయంలా ప్రభావితం చేశాయి. ఈ ఉత్తరాలే ఉత్తరోత్తర 'గ్లింప్సెస్ ఆఫ్ వరల్డ్ హిస్టరీ' (ప్రపంచ చరిత్రలో దృశ్యాలు) పేరుతో అచ్చయి ప్రపంచ ప్రజల మన్ననలు పొందింది. ఈ పుస్తకాన్ని వెల్స్ రాసిన 'ప్రపంచ చరిత్ర' తో పోల్చవచ్చు. ఆ విధంగా కారాగారంలో ఉన్న సమయాన్ని అధ్యయనానికీ, రచనకూ వెచ్చించి భారత సాహిత్య రంగాన్ని కూడా సుసంపన్నం చేసిన మేధావి నెహ్రూ.



1935లోజరిగిన ఎన్నికల్లో నెహ్రూ పోటీ చేయకపోయినా దేశవ్యాప్తంగా కాంగ్రెస్ గెలుపుకోసం కృషిచేశారు. 1936, 1937 ఇంకా 1946 సంవత్సరాల్లో కాంగ్రెస్ పార్టీకి అధ్యక్షుడిగా పనిచేశారు. 1938లో ఒకసారి ఐరోపా వెళ్ళి వచ్చిన నెహ్రూను బ్రిటిష్ ప్రభుత్వం చైనాకు దూతగా పంపింది. కానీ, రెండవ ప్రపంచ యుద్ధం ప్రారంభమవడం, భారతదేశం కూడా యుద్ధంలో పాలుపంచుకోవాల్సిరావడంతో నెహ్రూను చైనా నుంచి వెనక్కి పిలిపించారు. భారత స్వాతంత్ర్య సంగ్రామంలో పాల్గొంటూనే ఉత్తరాల ద్వారా ఐరోపాలో చాలామంది మేధావులతో శాస్త్ర సాంకేతిక రంగాల పురోగతి గురించి, ప్రపంచ రాజకీయాల్లో మార్పుల గురించి చర్చించేవారు. లండన్ నగరంలో ఉన్న మేధావి, దార్శనికుడు బెర్ట్రాండ్ రస్సెల్ రచనలంటే నెహ్రూకు ప్రత్యేక అభిమానం.

'క్విట్ ఇండియా' ఉద్యమంలో నెహ్రూ పాల్గొన్నందుకు బ్రిటీష్ ప్రభుత్వం మళ్ళీ కారాగారవాసం విధించింది. ఈసారి దాదాపు 3 సంవత్సరాలు కారాగారంలోనే గడపాల్సి వచ్చింది. ఆ సమయంలో నెహ్రూ రాసిన పుస్తకమే 'డిస్కవరీ ఆఫ్ ఇండియా' (భారతదేశ ఆవిష్కరణ). సింధు నాగరికతతో ప్రారంభమయ్యే ఈ పుస్తకంలో మధ్య ఆసియా నుండి ఆర్యుల దండయాత్ర, ఇంకా ఇతర ముఖ్య ఘట్టాలతో భారతదేశ చరిత్రను రక్తికట్టించారు. భారతదేశానికి స్వాతంత్ర్యం దాదాపు వచ్చేసిందనుకుంటున్న సమయంలో నెహ్రూ ప్రతిభను గుర్తించిన బ్రిటిష్ ప్రభుత్వం ఆయన్ని సెప్టెంబరు 1946లో ఏర్పడిన 'మధ్యంతర ప్రభుత్వానికి' అధినేతగా నియమించారు. ఈ నిర్ణయానికి కాంగ్రెస్ శ్రేణులు కూడా సంతసించాయి. అదేకాలంలో 'గవర్నర్ జనరల్ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్'కు ఉపాధ్యక్షుడిగా కూడా సేవలందించారు నెహ్రూ.

అది సంధికాలం. భారత ఉపఖండం ఒక దేశంగా ఉండాలా, రెండు దేశాలుగా విడిపోవాలా అని చర్చలు, వివాదాలు, ఘర్షణలు రేగిన సమయంలో 'రెండు దేశాల' ఏర్పాటుకు నెహ్రూ ఆమోదం తెలిపారు. పాకిస్తాన్ ఏర్పాటుకు జిన్నా కూడా పట్టుబట్టారు. ఈ పరిష్కారం గాంధీజీకి ఏమాత్రం ఇష్టంలేదు. దేశవ్యాప్తంగా అల్లర్లు, దొమ్మీలు, దాడులు జరుగుతున్నాయి. వేలసంఖ్యలో ప్రజలు ప్రాణాలు కోల్పోతున్నారు. ఒకవైపు గాంధీ, మరోవైపు నెహ్రూ పరిస్థితుల్ని అదుపులోకి తెచ్చారు. 1947 ఆగస్టు 15న భారతదేశ త్రివర్ణ పతాకం ఎర్రకోటపై ఎగిరే సమయానికి అందరికీ ఆమోదయోగ్యమైన నాయకుడు నెహ్రూ మాత్రమే. గాంధీ

పదవులకు దూరంగా ఉండడంతో నెహ్రూ భారతదేశ మొదటి ప్రధానమంత్రయ్యారు.

ఇప్పటివరకు చేసిన పోరాటం సత్ఫలితాలనిచ్చింది. ఇకముందు చేయబోయే కృషి భారతదేశాన్ని శక్తివంతంగా తీర్చిదిద్దాలి. దేశవ్యాప్తంగా ఉన్న 500 సంస్థానాల్ని ఏకత్రాటిపైకి తీసుకురావడం, కొత్త రాజ్యాంగం, హిందూ-ముస్లింల మధ్య సంబంధాలు ముందున్న సవాళ్ళు. అంబేద్కర్ మోధోవ్యవసాయంతో ఫలించిన భారత రాజ్యాంగం రెండేళ్ళ తర్వాత ఆమోదం పొంది ఆచరణలోకొచ్చింది. భారత రాజ్యాంగం ప్రజాహితంగా ఉండడం వెనుక నెహ్రూ కృషి చాలా వుంది. భారతదేశం బౌద్ధ ధర్మచక్రాన్ని, అశోకుడు సృజింపజేసిన నాలుగు సింహాల సారనాథ్ స్థూపం గుర్తుల్ని అధికారిక చిహ్నాలుగా ఎన్నుకోవడంలోని నెహ్రూ పాత్రను నేటితరం వారు మరచిపోయి ఉండవచ్చు. ఆర్థికాభివృద్ధికి సోవియట్ యూనియన్‌ను మార్గదర్శిగాతీసుకున్న నెహ్రూ వరుసగా 3 పంచవర్ష ప్రణాళికలు రచించి, ఆచరించారు. 'ప్లానింగ్ కమీషన్'ను ఏర్పాటు చేసింది నెహ్రూయే. సైన్సు, టెక్నాలజీ రంగాల్లో భారతదేశం వెనుకబడి ఉన్నదని గ్రహించిన నెహ్రూ ఈ రంగాలకు చేయూతనిచ్చారు. 'ఇండియన్ ఇన్‌స్టిట్యూట్స్ ఆఫ్ టెక్నాలజీ' లను పలు నగరాల్లో స్థాపించారు.


నెహ్రూ భారత ప్రధాని అయిన తర్వాత తననివాసాన్ని ఢిల్లీలోని 'తీన్‌మూర్తి భవన్'కు మార్చారు. ఈ భవనం బ్రిటీష్ మిలటరీ అత్యున్నత అధికారి నివసించిన భవనం. దీన్ని 'ఫ్లాగ్ స్టాఫ్ హోమ్' అనేవారు. నెహ్రూ మరణించిన తర్వాత ఈ భవనం ప్రదర్శనశాలగా మార్చబడింది. ఈ భవనం ఆవరణలో గల 'శిలాశాసనం' భారతదేశం స్వాతంత్ర్యాన్ని సంపాదించిన విషయాన్ని గర్వంగా చాటుతుంటుంది.

ప్రధానిగా ఉన్న సమయంలోనే చాలాకాలంపాటు విదేశీ వ్యవహారాలు కూడా నెహ్రూ చూసుకున్నారు. భారతదేశ పరిపాలన చూసుకుంటూనే నెహ్రూ అనేక అంతర్జాతీయ సమస్యలపై కూడా స్పందించేవారు. కొరియన్ యుద్ధం, అంగోలా సమస్య మొదలైన అంతర్జాతీయ సమస్యల పరిష్కారాల్లో మధ్యవర్తిత్వం నెరిపారు. 1955లో ఇండోనేషియాలో జరిగిన 'బాండుంగ్' సమావేశంలో ముఖ్యపాత్రను పోషించి యుగోస్లోవియా నేత టిటో, ఈజిప్టు నేత నాజర్‌లతో కలసి 'అలీన' ఉద్యమాన్ని ప్రారంభించారు. సోవియట్ యూనియన్ నేత కృశ్చేవ్ భారతదేశ సందర్శన చేసి అనేక రంగాల్లో రష్యా భాగస్వామిగా ఒప్పందాలు చేసుకున్నారు. దేశం లోపల పంచాయతీరాజ్ వ్యవస్థకు రూపకల్పన చేశారు. బహుముఖంగా ఇన్ని పనులు చేసినా పొరుగు దేశాలైన పాకిస్తాన్, చైనాలు భారతదేశంతో సత్సంబంధాలకు తాత్సారం చేశాయి. టిబెట్ మతగురువు దలైలామా భారతదేశంలో ఆశ్రయం పొందడం, 1962 లో చైనా భారతదేశంపై దండయాత్ర చేయడం, అధిక భూభాగాన్ని కోల్పోవడం నెహ్రూకు మానసిక ప్రశాంతతను దూరం చేశాయి. 1959లో కేరళ ప్రభుత్వాన్ని (కమ్యూనిష్టు) రద్దుచేయడం, 'కామరాజు' ప్లాన్‌తో ముఖ్యనేతల్ని రాష్ట్రాలకు పంపడంలాంటి చర్యలు నెహ్రూ ప్రభావాన్ని కొంత తగ్గించినా ఆ రోజున ఉన్న పరిస్థితుల్లో ఉత్తమ నాయకత్వాన్ని అందించిన రాజకీయ నిపుణుడు జవహర్‌లాల్ నెహ్రూ.

'పంచశీల'ను ఇతర దేశాల నేతలు సరిగ్గా అర్థం చేసుకోనందువల్లనే ఇన్ని అనర్థాలు కలుగుతున్నాయని మథనపడిన నెహ్రూ 1964 మే 27న పరమపదించారు. నిర్ద్వంద్వంగా భారతదేశాన్ని ప్రగతి మార్గంలో పయనింపజేసిన ఖ్యాతి నెహ్రూకు మాత్రమే దక్కుతుంది.

❋ ❋ ❋ ❋



# ఆ మూడు విశ్వవిద్యాలయాలు ఎన్టీఆర్ మానసపుత్రికలు



చలనచిత్ర, రాజకీయ రంగాల్లో తిరుగులేని నాయకుడిగా వెలుగొందిన ఎన్టీ రామారావు సంకల్పబలం గొప్పదని కేంద్ర మంత్రి డి.పురంధేశ్వరి వ్యాఖ్యానించారు. తమిళనాడులో వైద్య విశ్వవిద్యాలయం ఏర్పాటు చేస్తే సంవత్సరంలో మూతపడిందని, ఇక్కడ ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం నిలదొక్కుకుని పాతికేళ్ళు పూర్తి చేసుకోవడానికి ఆయన సంకల్పబలమే కారణమన్నారు. అలాగే ఎన్టీఆర్ పెట్టిన రు.2 లకే కిలో బియ్యం పథకం మధ్యలో ఆగిపోయినా మళ్లీ రావడం, ఇప్పుడు రూపాయికే కిలో బియ్యం ఇవ్వాలనే పథకం రావడానికి కూడా ఎన్టీఆర్ సంకల్పబలమే కారణమని తాను భావిస్తున్నట్లు చెప్పారు. ఆరోగ్య విశ్వవిద్యాలయం రజతోత్సవాలను పురందేశ్వరి మంగళవారం విజయవాడలో ప్రారంభించారు. ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఎన్టీఆర్ విగ్రహాన్ని ఆవిష్కరించారు. అనంతరం జరిగిన సమావేశంలో ఆమె ప్రసంగించారు.

తెలుగు భాష, సంస్కృతి మరింత అభివృద్ధి చెందడానికి పాటుపడాలని హైదరాబాద్‌లో తెలుగు విశ్వవిద్యాలయం, మహిళలకు ఉన్నత విద్య అవసరమని తిరుపతిలో పద్మావతి మహిళా విశ్వవిద్యాలయాలను ఎన్టీఆర్ ఏర్పాటు చేశారు. ప్రజలంతా శారీరకంగా ఆరోగ్యంగా ఉంటేనే సమాజం ఆరోగ్యంగా ఉంటుందని, అత్యున్నత ప్రమాణాలతో కూడిన వైద్యులను తయారు చేసే దిశగా తోడ్పాడలని ఆరోగ్య విశ్వవిద్యాలయాన్ని విజయవాడలో స్థాపించారు. ఎంతో దూరదృష్టితో నెలకొల్పిన మూడు విశ్వవిద్యాలయాలు ఆయన మానస పుత్రికలు అని పురందేశ్వరి వివరించారు. రోగం రాకుండా ముందు జాగ్రత్త తీసుకోవడం, వచ్చిన తరువాత చికిత్స అందించడమే కాక రోగి కుటుంబ సభ్యులపై పడే ప్రభావాన్ని తగ్గించే కార్యక్రమాలపైనా ఎన్టీఆర్ విశ్వవిద్యాలయం దృష్టి పెట్టి పనిచేయాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో జరిగే ఆత్మహత్యలకు వ్యవసాయ రుణాలు తీర్చకపోవడం ఒక కారణమైతే వైద్య సేవలకయ్యే ఖర్చులు భరించలేకపోవడం రెండో కారణమని ఒక సర్వేలో తేలిందని పురందేశ్వరి వివరించారు. రోగాలు రాకుండానే అటు ప్రభుత్వం, ఇటు వ్యక్తిగతంగా అందరూ జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ప్రపంచవ్యాప్తంగా వస్తున్న కొత్త మార్పులను ఎప్పటికప్పుడు ఇప్పటి వైద్య విద్యకు జోడించి విద్యార్థులకు బోధించాలని సూచించారు. ఆరోగ్య విశ్వవిద్యాలయ విస్తరణ, పరిశోధన విభాగాల కోసం 75 ఎకరాలను కేటాయించడం, అదనపు ప్రొఫెసర్లు, సిబ్బందిని మంజూరు చేసినందుకు ముఖ్యమంత్రి కిరణ్‌కుమార్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. పరిశోధన విభాగం విశ్వవిద్యాలయ క్యాంపస్‌కు దగ్గరగా ఉండాలని, ఇప్పుడు ఇచ్చిన భూములు దూరంగా ఉన్నట్లు తన దృష్టికి తెచ్చారని, దీనిపై ప్రభుత్వంతో మాట్లాడతానని చెప్పారు. రజతోత్సవాల సందర్భంగా పురందేశ్వరిని విశ్వవిద్యాలయ ఉప కులపతి ఐ.వి.రావు రిజిస్ట్రార్ వేణుగోపాలరావు తదితరులు సన్మానించారు.



❋ ❋ ❋ ❋

అంతర్జాతీయం

# మంచి నియంత గడాఫీ, మానవాళికందించిన సందేశం?



- పాతూరి వెంకటేశ్వరరావు



లిబియాను పాలిస్తున్న 'ఇదిస్‌రాజు' పాశ్చాత్య దేశాల తొత్తుగా మారి లిబియాను దోపిడీకి గురిచేసాడు. అందుకు ఆగ్రహించిన గడాఫీ ఇదిన్‌రాజుపై, రాచరిక వ్యవస్థపై తిరుగుబాటు ప్రదర్శించాడు. ఐతే చుక్కరక్తం చిందకుండానే విజయం సాధించి **1969** సెప్టెంబరు 1న, లిబియా అధ్యక్షునిగా అధికారం చేపట్టి రక్తపాత రహిత విప్లవ విజేతగా చరిత్ర సృష్టించాడు గడాఫీ.

మధ్యధరా సముద్ర ప్రాంతంలో, ఉత్తరాఫ్రికాలోని లిబియా దేశం, రాజకీయంగా వ్యూహాత్మక ప్రాధాన్యత కలిగిన దేశం. అది చాలాకాలం ఇటలీ పాలనలో మగ్గటం వలన, అనంతరం పాశ్చాత్య దేశాల తొత్తులైన రాజుల పాలన వలన, గడాఫీ అధికారం చేపట్టే నాటికి ఆకలిచావులతో కూడిన దయనీయ జీవితాన్ని గడుపుతున్నారు లిబియా ప్రజలు. అట్టి సమయంలో అలా అధ్యక్షుడైన గడాఫీ నాడు లిబియా ప్రజలందరి దృష్టిలో వారి కోసమే అవతరించిన అవతారపురుషుడు. లిబియా యువకులకు ఆయన ఆదర్శనీయ అభిమానహీరో. తననంతగా అభిమానిస్తున్న తన లిబియా దేశాన్ని అగ్రరాజ్యాలకు ధీటుగా అభివృద్ధి పరచేందుకు కంకణం కట్టుకున్నాడు గడాఫీ.

లిబియాలోని 'సిర్టీ' ప్రాంత సమీప ఎడారిలో 1942లో జన్మించాడు గడాఫీ! మేకలు, గొర్రెలు, ఒంటెలు మేపుకు బ్రతికే 'గఢాఫీ' తెగకు చెందిన గఢాఫీ, తమలాంటి, ఆటవిక, ఆదివాసీ జాతుల సమైక్యతకు, ప్రగతికి కృషి చేసాడు. బాల్యం నుండే అరబ్ జాతీయత కు ప్రతీకగా నిలిచిన ఈజిప్టు అధ్యక్షుడు 'గమాల్ అబ్దుల్ నాజర్' పై అభిమానం పెంచుకున్నాడు. ఆ స్ఫూర్తితోనే 14 ఏళ్ళ ప్రాయంలోనే సూయజ్ సంక్షోభ సమయంలో ఇజ్రాయిల్ వ్యతిరేక సదస్సులో పాల్గొన్నాడు గడాఫీ. 20 సంవత్సరాల వయస్సులో సైనిక కళాశాలలో

చేరాడు. సైనిక శిక్షణ పూర్తి కాగానే ఇంగ్లండు నుండి లిబియాకు వచ్చేసాడు. అతనికి జవహర్ లాల్ నెహ్రూ అన్నా, భారతీయులన్నా ఎనలేని అభిమానమట. ఉద్యోగార్థం లిబియా వచ్చిన భారతీయులకు తక్షణం సకల వసతులను, అభిమానపూర్వకంగా కల్పించేది గడాఫీ ప్రభుత్వం. అలాగే నెహ్రూ గారి మిశ్రమ ఆర్థిక విధానాలను ఆదర్శంగా తీసుకున్న గడాఫీ కేపిటలిజం + సోషలిజం + ఇస్లామిజం సమాజాలలో సరికొత్త (గడాఫీ) ఇజం రూపొందించాడు 1970లో. దానికాయన పెట్టిన పేరు 'జమాహిరియా' అంటే ప్రజారాజ్యం లేక మనం అనుకునే రామరాజ్యం వంటిదని భావం. దాని ప్రకారం లిబియాలోని భారీ పరిశ్రమలన్నీ ప్రభుత్వ రంగంలోను, చిన్న పరిశ్రమలు ప్రైవేటు రంగంలోనూ కొనసాగుతున్నయి. ప్రపంచంలోనే అత్యధిక చమురు నిల్వలు గల దేశం లిబియా అన్న వాస్తవాన్ని గుర్తించిన గడాఫీ దేశంలోని చమురు సంస్థలన్నింటినీ జాతీయం చేసాడు.

వాటిద్వారా వచ్చే ఆదాయాన్ని సౌదీ అరేబియా, కువైట్ దేశాలలో అమెరికా బ్యాంకుల్లో దాచకుండా తన దేశంలోని అభివృద్ధి, సంక్షేమ కార్య క్రమాలకు, సమర్థవంతంగా వినియోగించాడు గడాఫీ. తత్ఫలితంగానే ప్రపంచంలోకెల్లా అతి పెద్ద సేద్యపునీటి ప్రాజెక్టు లిబియాలో వెలిసింది. అదీ సహారా ఎడారి క్రింది గుండా, అతి భారీ పైపు లైను ద్వారా రోజుకు 65 లక్షల క్యూబిక్ మీటర్ల నీటిని సరఫరా చేపిస్తున్నాడు లిబియాకు, లిబియాలోని పలు నగరాలు, గ్రామాల త్రాగునీటికి అదే ఆధారం. ఇక లిబియాలో వ్యవసాయం చేసేవారికి భూమి, వ్యవసాయ పరికరాలు, ఎరువులు, మందులు, నిపుణుల సలహాలను గూడ ప్రభుత్వమే సమకూరుస్తుంది. యునెస్కో నివేదిక ప్రకారం లిబియా యువకులలో అక్షరాస్యత 99.9%, ప్రజలందరిలో 83% అక్షరాస్యతలో లిబియాకు సాటి లిబియాయే. అలాగే ప్రజలందరి వైద్యము మందులకయ్యే ఖర్చునంతా భరించటమే గాక, దీర్ఘకాలం ఆసుపత్రి పాలైన వారి కుటుంబ ఖర్చులను గూడ లిబియా ప్రజాసంక్షేమశాఖే భరిస్తుందని డబ్ల్యు.హెచ్.ఓ. ప్రకటించింది.




లిబియా ప్రజలందరికీ ఉచిత విద్యుత్తు అవసరపడినవారికి ఆయా మొత్తాన్ని వడ్డీ లేని రుణాలుగా ఇస్తాయి లిబియా బ్యాంకులు. పెళ్ళైన కొత్త జంటలకు ఇల్లూ వాకిళ్ళుతో స్థిరపడమంటూ50 వేల డాలర్లకు గిఫ్ట్ చెక్ నిస్తుంది గడాఫీ ప్రభుత్వం. కారుకొనుక్కునే వారికి సగం ఖర్చు ప్రభుత్వమే భరిస్తుంది. లిబియాను అలా తననుకున్నట్లు భూలోక స్వర్గంగా తీర్చిదిద్దాడు. తన లిబియాను రాజకీయంగా సోషలిస్టు ఆర్థిక విధానాలను, మత పరంగా పరమత సహనాన్ని, దౌత్యపరంగా సామ్రాజ్యవాద వ్యతిరేకత, వర్ధమాన దేశాలలో సంఘీభావం తో కూడిన వ్యూహాలతో తీర్చిదిద్దుకున్నాడు గడాఫీ.

తన దేశాన్నిలా ప్రగతిపథాన నడుపుతూనే, ఈజిప్ట్, సుడాన్‌వంటి అరబ్ దేశాలన్నింటినీ 'అరబ్ రిపబ్లిక్' గా సమైక్యపరచి, దానిని ఇస్లామిక్ సోషలిస్టు వ్యవస్థగా తీర్చిదిద్దాలని కలలుగన్నాడు గడాఫీ. అట్టి 'థర్డ్ ఇంటర్నేషనల్ థియరీతో గడాఫీ వ్రాసిన 'గ్రీన్ బుక్' ప్రపంచ వ్యాపితంగా బైబిల్ తర్వాత అంతభారీగా అమ్ముడు పోయిన గ్రంథం గా రికార్డు సృష్టించింది. ఐనా ఆయన ఆశయం నెరవేరలేదు. కనీసం ఆఫ్రికా దేశాలనైనా 'యునైటెడ్ స్టేట్ ఆఫ్ ఆఫ్రికా' గా ఒకే గొడుగు క్రిందకి తేవాలన్న అతని రెండవ ఆశయమూ నెరవేరకుండానే అక్టోబరు 20న అమెరికా నాటో దళాల ప్రోత్సాహంతో లిబియా తిరుగుబాటుదారులు గడాఫీని కాల్చేసారు.

ఐతే దేశాన్ని అంతగా అభివృద్ధి చేసిన దేశాధినేత పై ప్రజలు అంతటి ద్వేషాన్ని ఎందుకు? ఎలా పెంచుకోగలిగారు. అన్న ప్రశ్న తలెత్తడం సహజం. దీనికి ప్రధాన కారణం ఏమంటే?

నిజానికి గడాఫీ సాహసి, మేధావి, ఎనలేని దేశభక్తుడు. తనదేశాభివృద్ధికోసం




తనకు ముందులిబియా, తన హయాంలోని లిబియాను గూర్చి, ఇలా భూలోక స్వర్గంగా లిబియాను మలిచేందుకు తను పడ్డ శ్రమను గూర్చి ఇప్పటికీ సామ్రాజ్యవాద అమెరికా నాటో దేశాలవారు లిబియా చమురుపై ఆధిపత్యం కోసం పన్నుతున్న కుట్రలు, కుతంత్రాలు గూర్చి, విస్తృతంగా రచనలు, సినిమాలు, పాఠ్యాంశాల రూపంలో తనదేశ ప్రజలను చైతన్యవంతం చేసేందుకు ప్రయత్నించియున్నట్లయితే, లిబియా ప్రజల హృదయాలలో 'లిబియా జాతిపిత'గా గడాఫీ కలకాలం నిలిచి యుండేవాడు. కులాల స్థాయి నుండి కోటీశ్వరుల స్థాయికి ఎక్కదిసుకొచ్చినా ఆ కుటుంబ సభ్యులపై చీటికిమాటికీ నోరు, చేయి చేసుకొనే యజమాని ఆ కుటుంబ సభ్యులందరి ద్వేషానికి గురైనట్లే లిబియా ప్రజల ద్వేషానికి గురయ్యాడు గడాఫీ.

కారుచౌకగా చమురు నిల్వలను కాజేసేందుకు శిఖండిలా అడ్డుపడుతున్న గడాఫీపై ఎన్నో హత్యా ప్రయత్నాలు చేసి గూడ విఫలమైన అమెరికా నాటో దేశాల వారు అతని చావుకోసం గుంటనక్కల్లా పొంచి కూర్చున్నారు. అందుకే ఈ అవకాశాన్ని వారు చేజార్చుకోలేదు. లిబియా తిరుగుబాటుదారులకు ఆర్థిక, ఆయుధ, సైనిక అండదండలను, పూర్తిగా అందించారు. వారితోడ్పాటుతోనే యన్.టి.సి. (జాతీయ పరివర్తనా మండలి) ని స్థాపించుకొని గడాఫీపై రణభేరి మ్రోగించారు. దాన్తో ఆగస్టులో అధ్యక్షపీఠం వదలి పారిపోయి స్వస్థలంలోని ఒక డ్రైనేజి పైపులైన్లో దాక్కున్నాడు గడాఫీ. ఐనా అతనిని వెంటాడి బయటకు లాగి అక్టోబరు 20 న కాల్చిచంపారు. ఈ విషయాన్ని యన్.టి.సి. అధికార ప్రతినిధి, 'అబ్దుల్ అఫెజ్‌ఘోగా' దానిమిలిటిరీ నాయకుడు 'అబ్దుల్ హకీం బెల్ హాజ్' లు ధృవీకరించారు. లిబియా యన్.టి.సి. కి భారత ప్రభుత్వం మద్దతు ప్రకటించింది. కానీ 'లిబియాలోని చమురు నిల్వల కోసం, వ్యూహాత్మక ఆధిపత్యం కోసమే, అమెరికా నాటో దళాలు లిబియాపై దాడి చేశాయి. అని సి.పి.యం. పోలిట్‌బ్యూరో – 'అమెరికా నాటో దళాలు కుట్రతో గడాఫీని చంపేసాయి. ఇది యుద్ధనేరం' అంటూ సి.పి.ఐ.యం.ల్ పార్టీలు అమెరికా నాటో

అనూహ్యమైన అద్భుతాలను సాధించిన అనన్య సామాన్యుడు కూడా. ఆ భావనతోనే నన్ను మించిన వాడు లేడు అన్న అహంభావం ఏర్పడింది గడాఫీకి. దేశంకోసం త్రికరణ శుద్ధిగా పాటుపడుతున్న దేశభక్తుడను నేను, నన్ను వ్యతిరేకించే ప్రతి ఒక్కడూ దేశద్రోహి అన్న భావన ఆయనలో జీర్ణించుకుపోయింది. అందుకే తన విధానాలను ప్రశ్నించినా, తనను విమర్శించినా వ్యతిరేకించినా తనపై తిరుగుబాటుకు ప్రయత్నించినా వారిని దేశద్రోహులుగా పరిగణించేవాడు. అలాంటివారు తన ప్రజలనైనా సరే సామ్రాజ్య వాద తొత్తులుగా కనిపించేవారు గడాఫీ కళ్ళకు. అందుకే అలాంటి వారిని తక్షణం చిత్రహింసలకు గురిచేసి చంపటమేకాక ఆ దృశ్యాలను టి.వి.ల ద్వారా చూపి, తన వ్యతిరేకులను భయభ్రాంతులను చేయడం ద్వారా తన అధికారాన్ని భద్రపరచుకొనే దుస్సాహసానికి పాల్పడ్డాడు గడాఫీ.

అదే చాపక్రింద నీరులా అంతటి ప్రగతిశీలి, దేశభక్తుడైన గడాఫీ మీద వ్యతిరేకత, ద్వేషాలను, లిబియా అంతటా విస్తరింపచేసింది. లిబియా అభివృద్ధి కోసం గడాఫీ పడ్డ కష్టాన్ని కళ్ళారా చూసిన పాతతరం వాళ్ళు పరిస్థితిని వివరించేందుకు ప్రయత్నించినా యువతరం పెడచెవిన పెడుతుంది. నలభై సంవత్సరాల సుదీర్ఘ పాలనలో ఇటీవల తరాలకు గడాఫీ శ్రమ ఎలా తెలుస్తుంది? అందుకే గడాఫీ గనుక అలా నిరంకుశంగా ప్రజలను శిక్షించడం కన్నా,

దళాల చర్యను తీవ్రంగా ఖండించాయి. అలాగే 'భారీ చమురు నిల్వలున్న లిబియాపై రాజకీయ ఆధిపత్యం కోసమే అమెరికా నాటో దళాలు లిబియా అంతర్గత పోరాటంలో తలదూర్చాయని, రాజకీయ ఉద్దేశాలతో ముందుకొచ్చిన నాటో దేశాల జోక్యాన్ని లిబియా ప్రజాస్వామ్యవాదులు తిరస్కరించి ఉంటే బాగుండేదని భారతీయ ప్రముఖ పత్రికలు వ్యాఖ్యానించాయి.

**"నాయకులెంతటి దేశభక్తులైనా, దేశంకోసం, ప్రజలకోసం ఎంతగా పాటుపడిన వారైనా సరే, ఆ వాస్తవాన్ని మరచి తమను తిరస్కరించినప్పటికీ ప్రజలపట్ల నిరంకుశంగా కర్కశంగా ప్రవర్తించరాదు అలా వ్యవహరిస్తే ఫలితమెలా వుంటుందో నా మరణమే మీకు నిదర్శనం. అన్న సందేశాన్ని మానవాళి కందించి వెళ్ళిన మంచి నియంత గడాఫీ.**






ఇక ప్రపంచంలోనే హైలెట్సుగా చెప్పుకునేలా లిబియాలో గడాఫీ సృష్టించిన అద్భుతాలివీ -


(1) లిబియా వార్షిక తలసరి ఆదాయం 7 లక్షల రూపాయలు.

(2) ప్రపంచంలో అప్పులేని ఏకైక దేశం లిబియా.

(3) ఉద్యోగార్థం ఇతర దేశాలకు ఒక్క పౌరుడు కూడా వలస వెళ్ళని ఏకైక దేశం లిబియా.

(3) తను అప్పు చేయక పోగా అమెరికా లాంటి అగ్రదేశానికి 100 బిలియన్ డాలర్లు, నాటో అగ్రదేశాలకు 50 బిలియన్ డాలర్లను అప్పు ఇచ్చిన దేశం లిబియా.





# జన్మదిన శుభాకాంక్షలు.....

కవిత

పందొమ్మిది వందల డెబ్బైమూడు నవంబరు తొమ్మిదిన
జయంతీ శేషగిరి పుణ్యదంపతులకు జన్మించావు!
రాజేశ్వరీ హనుమంతరావుల ప్రేమానురాగాలతో పెరిగావు!

ప్రజానాయకుడు పెదనాన్న గారి మరణ దుఃఖభారంతో
ధావణగిరి బాపూజీ కళాశాలలో ఇంజనీరు విద్యను విరమించావు
పెదనాన్నగారి ఆశయ సాధనకోసం పెద్దమ్మ గారి ఆశీస్సులతో
రాజకీయ రంగ ప్రవేశం చేసిన ఓ చిరంజీవి రవికుమార్!

నాడు నిన్ను చూసిన మేమంతా, నీవొక పసిబాలుడవనీ
రాజకీయమొక పద్మవ్యూహం కదా అని తెగభయపడిపోయాము!
ప్రత్యర్థులైతే ఈ ఛోటాబాలుణ్ణి చప్పరించి పారేస్తామన్నారు!

కానీ అనూహ్యంగా, ఆశ్చర్యంగా, అద్భుతంగా
ఆ రాజకీయ పద్మవ్యూహాన్ని ఛేదించిన అభినవ అభిమన్యునిగా
టీడీపీ కంచుకోటను బదాబదాలు చేసిన తొలి కాంగ్రెస్ నాయకునిగా,
చరిత్ర సృష్టించి ప్రత్యర్థుల్ని ఆశ్చర్యంలో మమ్మల్ని ఆనందంలో తేల్చేసావ్!
శభాష్ చిరంజీవీ! శభాష్ శ్రీ గొట్టిపాటి రవికుమార్ జీ శభాష్ !
విజయుడవైన నాటి నుండి నేటి దాకా మొన్న మార్టూరు
నేడు అద్దంకి నియోజకవర్గమంతటా గడియారంలోని సెకన్ల ముల్లులా
పర్యటిస్తూ, ప్రజలను కన్నబిడ్డల్లా, కార్యకర్తల్ని కంటికి రెప్పలా
కాపాడుకున్నావు, వారి గుండెలలో కొలువుండిపోయావు.

సముద్రం నుండి నీళ్ళు తెచ్చి భూమ్మీద వర్షించే మేఘంలా
ప్రభుత్వం నుండి కోట్లాది నిధులు తెచ్చి నియోజకవర్గంలో కుమ్మరించావ్ !
తండ్రి, సోదరుల చెంతకెళ్ళినంత చొరవగా, ముఖ్యమంత్రి, మంత్రుల చెంతకెళ్ళి
అసెంబ్లీలో నీవాణిని గూడ వినిపించి, పలు ప్రజాసమస్యలను పరిష్కరిస్తున్నావు.
అద్దంకిలో అడుగు పెట్టటంతోనే ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలను రప్పించావు!
బాలికోన్నత పాఠశాలకు భవన, పలు వీధులకు సిమెంటు రోడ్ల వసతి కల్పించావు.
ఏళ్ళ తరబడిగా ఆగిపోయిన రావినూతల పేదలకు పట్టాలిప్పించావు.
గుండ్లకమ్మ ఏటి ఒడ్డు గ్రామాలకు తరతరాల తారురోడ్డు కలను నిజం చేశావు.

భవనాశి చెరువును పర్యాటక కేంద్రంగా, ఇంజనీరు కళాశాలతో
సింగరకొండను ప్రముఖ విద్యాకేంద్రంగా, తీర్చిదిద్ద సంకల్పించావు!
ప్రభుత్వ పథకాలను ప్రతిపేద ముంగిటకీ నడిపించేందుకు నడుంబిగించావు!
ఆ ప్రసన్నాంజనేయ స్వామి నీ సదాశయాలన్నింటినీ నెరవేర్చుగాక!
నీ నీతి నిజాయితీకి, ప్రజాసేవా నిరతికి, ప్రగతికి పొంగిపోతున్నారు.
నీ మాతృమూర్తి, బంగారు తల్లి జయంతి! అమృతమూర్తి రాజేశ్వరి పెద్దమ్మ!
నిన్ను పుత్రునిగా ప్రేమిస్తున్నారు అత్తమామలు లక్ష్మీ సుబ్బారావులు!
నిన్ను ప్రాణప్రదంగా చూచుకుంటూ నిన్ను చూసుకొని గర్వపడుతున్నది నీ ఇల్లాలు ఝాన్సీ
నిన్ను మించనున్నారు రత్నాల వంటి నీ బిడ్డలు హర్షవర్ధన్! విష్ణువర్ధన్!
బంధుమిత్రులు ప్రజలను సమాదరించే, నీ వంటే ఎల్లరకూ ప్రేమే రవికుమార్!
నవ నవలాడుతూ ఎదుగుతున్న మొక్కవు రవీ! అనతికాలంలోనే
ఎందరెందరికో ఆశ్రయాన్ని, ఎల్లరకూ ఆనందాన్ని కల్గించే,
మహోన్నత ఫలవృక్షంలా ఎదగాలని, నీ కృషి తప్పక ఫలించాలనీ
అందుకు కావలసిన శక్తియుక్తులను, ఆయురారోగ్య ఐశ్వర్యాలను నీకు
ఆ పరమాత్ముడు సంపూర్ణంగా ప్రసాదించుగాక!
చిరంజీవ రవికుమార్ జీ! చిరంజీవ! చిరంజీవ!
తథాస్తు! సర్వదా నీకు శుభమస్తు!



సదా మీ శ్రేయోభిలాషులు



**– పాతూరి వెంకటేశ్వరరావు**
సెల్ : 9849081889

సినిమా

# ఊరూ, పేరూ లేని హీరోతో నటిస్తున్న శ్రియా



సూపర్‌స్టార్ రజనీకాంత్, జాతీయస్థాయి ఉత్తమ నటుడు విక్రమ్ ఇలా అగ్రతారాగణంతో నటించిన శ్రియను ఇప్పుడా తారలు పట్టించుకోవడం లేదట. కుర్ర హీరోయిన్లును బుక్ చేసేందుకు ఉత్సాహం చూపిస్తున్నారు తప్పించి శ్రియ వైపు చూడడంలేదట. ఒకవేళ ఛాన్సుల కోసం వెళ్తుంటే క్షేమసమాచారాలను కనుక్కొని మర్యాదపూర్వకంగా పంపించేస్తున్నారట. అంతే తప్ప ఛాన్సులు ఇస్తామని మాత్రం హామీ ఇవ్వడం లేదట. దీంతో ఊసురుమంటున్న శ్రియ చిన్న చిన్న హీరోలతో కూడా సై అనేందుకు సిద్ధపడుతుందట. ప్రస్తుతం తమిళంలో ఓ సినిమా బుక్ అయ్యిందట. ఈ విషయం తెలుసుకున్న ఓ పిల్ల జర్నలిస్టు ఊరూపేరూ లేని ఓ కొత్త హీరోతో నటిస్తున్నావా శ్రియా అంటూ ప్రశ్నించాడట. దీంతో చిర్రెత్తిన శ్రియ... నా ఇమేజికు తగిన హీరోతోనే చేస్తున్నానని సినిమా వచ్చాక చూడమని అతనిపై మండిపడిందట.



# 'మొగుడు' ని ఎవత్తి పెళ్ళిచేసుకుంటుందో కానీ – తాప్సీ

ఝుమ్మందినాదంతో తన గ్లామర్ అందాలను ప్రేక్షకులకు చూపించిన తాప్సీ అలా ఇలా మొదలై తాజాగా గోపీచంద్‌తో కలిసి నటించింది. చిత్రం పేరు 'మొగుడు – పెళ్ళాం' మొగుడు ఎలా వుండాలో ఈ చిత్రం ద్వారా తాను తెలుసుకున్నట్లు చెబుతుంది. గోపీచంద్‌తో నటించడం చాలా హ్యాపీగా వుందని, ఆయన తో వున్నంతసేపు టైమే తెలియదు. చాలా జోవియల్‌గా వుంటుంది. గోపీచంద్‌ను ఏ అమ్మాయి పెళ్ళిచేసుకుంటుందో కానీ ఆమె ఎంతో అదృష్టవంతురాలు అంటూ తాప్సీ కితాబు ఇచ్చింది. మొగుడు అంతబాగా నచ్చాడా... అంటే మాత్రం ఆ ఒక్కటీ అడక్కూ అంటూ ముసిముసినవ్వులు విసిరింది తాప్సీ.

## నా వ్యక్తిగత విషయాలు మీకెందుకు..... .........అమలాపాల్ ప్రశ్న



నా వ్యక్తిగత విషయాలు మీకెందుకంటూ మీడియాను నిలదీస్తోందట అమలాపాల్. దర్శకుడు విజయత్‌తో తానేదో ప్రేమకలాపాలు సాగిస్తున్నట్లు గాలి వార్తలు రావడంపై ఆమె మండిపడింది. సినిమాలు గురించి ఎంత రాసినా తాను పట్టించుకోనని, అయితే వ్యక్తిగత విషయాలు జోలికి వస్తే మాత్రం సహించేది లేదని కుండబద్దలు కొట్టినట్లు చెబుతుంది. ఇకనైనా ఇలాంటి గాలికబుర్లను సృష్టించడం మానుకోవాలని హితబోధచేస్తుంది. ఇది ఇలా వుంటే రాత్రి రాత్రికే టాప్ హీరోయిన్ల జాబితాలో చోటు సంపాదించుకొన్న అమలాపాల్ ప్రస్తుతం నాగచైతన్య సరసన 'బెజవాడ' సినిమాలో నటించింది. ఇంకా ఈ ముద్దుగుమ్మ తమిళంలో వేట్టై, ముప్పోళుదుమ్, మళయాళంలో ఒక సినిమా చేస్తుంది.

## 'డర్టీపిక్చర్' చిత్రాన్ని నిషేదించాలి, కోర్టులో పిటీషన్



ప్రముఖ సినీనటి సిల్క్‌స్మిత జీవితం ఆధారంగా నిర్మితమైన 'డర్టీపిక్చర్' పై విడుదలకు ముందే వివాదం చెలరేగింది. అవాస్తవాలతో కథను తయారు చేశారని అసభ్య దృశ్యాలతో సినిమా తీసారని పేర్కొంటూ స్మిత సోదరుడు నాగవరప్రసాద్ చిత్ర నిర్మాతలపై హైకోర్టులో పిటీషన్ దాఖలు చేశారు.

ఇదే విషయమై చిత్ర నిర్మాతకు తన తరుపు న్యాయవారి నోటీసు ఇచ్చినా స్పందించలేదని ఆయన ఆ పిటీషన్‌లో పేర్కొన్నారు. అందువలన ఈ సినిమాను పూర్తిగా నిషేదించాలని ఆయన కోరారు. పైపెచ్చు స్మిత జీవితం గురించి తమను సంప్రదించకుండా ఏకపక్షంగా చిత్రంలో అనేక కథాంశాలు జోడించారని అందువలన విధిలేని పరిస్థితుల్లో కోర్టును ఆశ్రయించడం జరిగిందన్నారు. ఈ చిత్రంలో సిల్క్‌స్మిత పాత్రను ప్రముఖ నటి విద్యాబాలన్ పోషిస్తున్నారు. ఈ చిత్రం విడుదల తరువాత అనేక టాలీవుడ్, బాలీవుడ్ ప్రముఖుల బండారం బయటపడొచ్చని ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి.

# పేదల సంక్షేమానికి కృషి

పేదల సంక్షేమానికి కాంగ్రెస్‌పార్టీ చిత్తశుద్ధితో కృషి చేస్తుందని మునిసిపల్ శాఖ మంత్రి మానుగుంట మహీధర్‌రెడ్డి అన్నారు. సంతమాగులూరులో గురువారం నిర్వహించిన రచ్చబండకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కోటి రూపాయల విలువైన అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేశారు. తొలుత ఆయనకు సంతమాగులూరులో ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్, మండల నాయకులు స్వాగతం పలికారు. అనంతరం స్థానిక ద్వారకానగర్ కాలనీలో రు.30 లక్షలతో నిర్మించనున్న మురుగుకాలువ నిర్మాణానికి మంత్రి శంకుస్థాపన చేశారు. కాలనీలో లింగశెట్టి వెంకటేశ్వర్లు ఇచ్చిన అతిథ్యాన్ని మంత్రి, ఎమ్మెల్యే, కలెక్టర్ కాంతిలాల్ దండే స్వీకరించారు. అనంతరం ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చేరుకున్నారు. విద్యార్థులు వీరికి గౌరవ వందనంతో స్వాగతం పలికారు. పాఠశాల్లో రు.32 లక్షలతో నిర్మించిన అదనపు గదులను మంత్రి ప్రారంభించారు. అనంతరం మండల పరిషత్ ఆవరణలో రు.25 లక్షలతో నిర్మించనున్న స్త్రీ శక్తి భవనానికి శంకుస్థాపన చేసి శిలాఫలకాన్ని ఆవిష్కరించారు.

## గొట్టిపాటిని అభినందించిన మంత్రి...

అభివృద్ధి కార్యక్రమాల అమలులో ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ జిల్లాలో ప్రథమ స్థానంలో నిలుస్తారని మంత్రి చెప్పారు. రేషన్‌కార్డుల మంజూరులో అద్దంకి నియోజకవర్గమే అగ్రభాగాన నిలిచిందన్నారు. కార్యక్రమం రచ్చబండే అయినా అగ్నిమాపక కేంద్రం, సంతమాగులూరులో వ్యవసాయ మార్కెట్ కమిటీ గిడ్డంగుల నిర్మాణంపై తమతో చర్చించడమే ఇందుకు నిదర్శనమని చెప్పారు.

## లబ్ధిదారులకు మంజూరు పత్రాల పంపిణీ...

రచ్చబండ కార్యక్రమం సందర్భంగా సంతమాగులూరు మండలానికి మంజూరైన 3,699 రేషన్ బియ్యం కూపన్లు, 385 పింఛన్ మంజూరు పత్రాలు, 450 గృహ నిర్మాణ మంజూరు పత్రాలను మంత్రి మహీధర్ రెడ్డి, ఎమ్మెల్యే రవికుమార్, కలెక్టర్ కాంతిలాల్ దండే, జాయింట్ కలెక్టర్ లక్ష్మీనృసింహం పంపిణీ చేశారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడి పద్మజ, హౌసింగ్ పీడీ సెల్వరాజ్, ఐసీడీఎస్ పీడీ చంద్రశేఖర్, ఆర్‌డబ్ల్యుఎస్‌ఈ, డీఎంహెచ్‌ఓ సుధాకరబాబు, అద్దంకి మాజీ ఎమ్మెల్యే జాగర్లమూడి రాఘవరావు, సంతమాగులూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్ బొల్లినేని రామకృష్ణ, మండల పరిషత్ ప్రత్యేకాధికారి అశ్వనికుమార్, ఎంపీడీఓ జె.రాజశేఖర్, తహశీల్దారు సి. వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



# నవభారత నిర్మాణమే యుపీఏ లక్ష్యం




దేశంలోని అన్ని గ్రామాలకు కనీస మౌలిక సదుపాయాలు కల్పించడమే లక్ష్యంగా యూపీఏ పనిచేస్తుందని కేంద్ర చేనేత జౌళి శాఖ సహాయమంత్రి పనబాక లక్ష్మీ అన్నారు. తద్వారా నవభారత్ నిర్మాణం సాధ్యమవుతుందన్నారు. ఆదివారం బల్లికురవలో జరిగిన రెండో విడత రచ్చబండ కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. గుంటుపల్లి, బల్లికురవల్లో రు.1.50 కోట్లతో నిర్మించిన పాఠశాల గదులు, సీసీ రోడ్డు, కాజ్‌వేను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో మంత్రి మాట్లాడుతూ పేదల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్న కేంద్రరాష్ట్ర ప్రభుత్వాలను కొందరు విమర్శించటమే ధ్యేయంగా పెట్టుకున్నారన్నారు. అద్దంకి నియోజకవర్గానికి ఒక్కసారిగా రు.80 కోట్ల అభివృద్ధి పనులు దక్కాయంటే ఎమ్మెల్యే రవికుమార్ కృషి ఏపాటిదో అర్థం చేసుకోవాలన్నారు. 1.15 లక్షల మందికి రాజీవ్ యువకిరణాల ద్వారా కిరణ్‌కుమార్ సర్కారు ఉపాధి చూపుతుందన్నారు. వచ్చే పార్లమెంటు సమావేశాలలో ఆహార భద్రత చట్టం తీసుకొచ్చేందుకు ప్రభుత్వం కృషిచేస్తుందన్నారు. అలాగే రూ.223 కోట్లతో 30 లక్షల మంది చేనేత కార్మికులకు వృత్తిపరమైన శిక్షణ కోసం ప్రత్యేక కార్యక్రమం ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. నియోజకవర్గానికి తన నిధుల నుంచి రు.1.30 కోట్లు వివిధ అభివృద్ధి పనులకు కేటాయించినట్లు చెప్పారు. రూపాయికి కిలో బియ్యం పథకం పేదవాడి ఆకలి తీర్చేందుకు సర్కారు కల్పించిన అదృష్టంగా భావించాలన్నారు. ఎమ్మెల్యే రవికుమార్ మాట్లాడుతూ పేదలందరికీ అభివృద్ధి ఫలాలు అందాలనే ధ్యేయంతో రాష్ట్ర ప్రభుత్వం రు.3,500 కోట్లతో 35 లక్షల మందికి ఈ రచ్చబండలో సంక్షేమ ఫలాలను అందజేయనుందన్నారు. నియోజకవర్గంలో 7 వేల మందికి కొత్తగా పింఛన్లు అందజేయనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో జేసీ లక్ష్మీనృశింహం, అదనపు జేసీ మోహన్‌రావు, ఆర్డీవో నాగబాబు, మాజీ ఎమ్మెల్యే రాఘవరావు, ఏఎంసీ ఛైర్మన్లు బొల్లినేని రామకృష్ణ, పులికం కోటిరెడ్డి, ఎంపీడీవో రవికుమార్, తహశీల్దారు సుబ్బలక్షిమ, సీడీపీవో ధనలక్ష్మి, ఏపీడీ భవానీ, డీఈ యోగేష్‌బాబు, ఏఈ మోహనరావు పాల్గొన్నారు.




❄ ❄ ❄ ❄

# ఉదయభానుడు రవికుమార్



- పాతూరి వెంకటేశ్వరరావు

నాడు ప్రపంచానికే ఆదర్శంగా నిలిచిన మన పవిత్ర భారతీయ సమాజం, నేడు ఐ.రా.స అవినీతి రహిత దేశాల జాబితాలో 87వస్థానానికి, మానవాభివృద్ధి సూచీలో 134వ స్థానానికి దిగజారటం మిక్కిలి దురదృష్టకరం. అందుకు అవినీతి ప్రధానకారణమన్న వాస్తవాన్ని ప్రజలు గుర్తించారు. కనుకనే అన్నాహజారే చేపట్టిన అవినీతి వ్యతిరేక ఉద్యమానికి ప్రజలమద్దతు వెల్లువెత్తింది.

దేశంలోని అన్ని రంగాలలో, ప్రధానంగా రాజకీయరంగంలో, "ధనంతో అధికారం - అధికారంతో ధనం" అన్న లక్ష్యంతో అవినీతి కదం తొక్కుతున్నది. 'చెడు' అన్నది చిల్లచెట్లలా విస్తారంగా విస్తరిస్తున్నది. ఆ కీకారణ్యంలోనే 'మంచి' అనే తులసి మొక్కలు ఫలవృక్షాలు మినుకు మినుకుమంటూ కనిపిస్తున్నాయ్. ఇట్టి క్లిష్ట పరిస్థితిలో అరుదుగా కనిపిస్తున్న ఫలవృక్షాల వంటి మంచినాయకులను కాపాడుకోవడం, వారిని మరింత బలోపేతం చేసుకోవడం అత్యవసరం. అది మనందరి సామాజిక బాధ్యతగూడ. ఎందుకంటే చిల్లచెట్ల నెవరూ కాపాడే ప్రయత్నం చేయనక్కరలేదు. వాటికవే అడ్డూఆపు లేకుండా విస్తరిస్తుంటయ్. కానీ తులసి మొక్కలు, పండ్ల చెల్లలా కాదు, వాటి ఎదుగుదలకు మన తోడ్పాటు అవసరం. వాటిని అణిచేసే చిల్లకంపను చెలుక్కుంటూ, పాదుచేసి, నీరుపోసి, చుట్టూ కంచెవేసి, తరచుగా ఎరువేస్తూ కాపాడుకోవడం ఎంత అవసరమో, మంచి నాయకులను కాపాడుకోవటానికి మన కృషి అంతే అవసరం. ప్రజలీ వాస్తవాన్ని గుర్తించలేకపోవడం వల్లనే, చిల్లచెట్లవంటి అవినీతి పరులు దెబ్బకు, ఫలవృక్షాల వంటి మంచినాయకులు కాగిపోతున్నారు. నానాటికీ అరుదైపోతున్నారు.



అందుకే త్యాగశీలురు, నిరాడంబరులు, నిజాయితీపరులైన మహనీయులను మనం పదే పదే మననం చేసుకుంటూ కృతజ్ఞతలు తెలుపుకుంటుండాలి. నిజాయితి ప్రజలకోసం పాటుపడటం తోపాటు, సొంత ఆస్తుల్ని దేశానికి త్యాగం చేసిన ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ, ముఖ్యమంత్రులు టంగుటూరి ప్రకాశం పంతులు, ఇ.యం.ఎస్ నంబూద్రిపాద్ చిరస్మరణీయులు. లాల్‌బహదూర్ శాస్త్రి, వి.పి.సింగ్, జి.యల్. నందా, మొరార్జీదేశాయ్, వాజ్‌పేయి మొ॥వారు, చిన్న అవినీతి మరకసైతం అంటని మంచి ప్రధానులు మాన్యులు.

ముఖ్యమంత్రులలో నిజాయితీ, నిరాడంబరతకు నిలువెత్తు నిదర్శనం నృపేన్ చక్రవర్తి, మచ్చలేని ముఖ్యమంత్రులు దామోదరం సంజీవయ్య, నందమూరి తారకరామారావు, కోట్ల విజయభాస్కరరెడ్డి, అచ్యుతానందన్, బుద్ధదేవ భట్టాచార్య, మాణిక్ సర్కార్ మొ॥వారు సదాగౌరవనీయులు. మచ్చలేని మంత్రులు గౌట్టిపాటి హనుమంతరావు దామచర్ల ఆంజనేయులు చెప్పుకోదగినపెద్దలు.

ఇక ప్రజాప్రతినిధులలో సొంత ఆస్తుల్ని దేశానికి త్యాగం చేసిన గొప్ప ప్రజాప్రతినిధి పుచ్చలపల్లి సుందరయ్య, నిరాడంబరతకు నిదర్శనంగా జీవించిన వావిలాల గోపాలకృష్ణయ్య, తవనం చెంచయ్య, ప్రజాక్షేమం కోసం సొంతధనాన్ని గూడా వెచ్చించిన మాగుంట సుబ్బరామిరెడ్డి సదాస్మరణీయులు. ఇప్పుడుదహరించిన వారు మచ్చుకు కొందరు మాత్రమే, ఇంకా ఇలాంటి వారెందరో. వారందరికీ కృతజ్ఞతాభివందనాలు.

ప్రస్తుత ప్రధాని మన్మోహన్‌సింగ్, రక్షణమంత్రి ఆంటోని, ఆర్థికమంత్రి ప్రణబ్ ముఖర్జీ, మానవ వనరుల మంత్రి పురందేశ్వరి మొ॥వారు నిర్మల పద్మాలలా భాసిస్తూ, భారతీయుల హృదయాలలో ఆశాజ్యోతుల్లా వెలుగొందుతున్నారు.

ప్రకాశం జిల్లాలో శాసనసభ, లోక్‌సభ, రాజ్యసభలకు ప్రజాప్రతినిధిగా మంత్రిగా వ్యవహరించినా తన సుదీర్ఘరాజకీయ జీవితంలో అవినీతికి సుదూరంగా నిలిచి నేటికీ 'మిస్టర్ క్లీన్' గా కీర్తింపబడుతున్న పెద్దమనిషి డా॥ దగ్గుబాటి వెంకటేశ్వరరావు, తన అన్నబాటలోనే నడుస్తున్న మాగుంట శ్రీనివాసరెడ్డి, పెదనాన్న బాటలోనే పయనిస్తున్న గొట్టిపాటి రవికుమార్ లాంటి నిజాయితీపరులు మన ప్రకాశం జిల్లాకే గర్వకారకులు.

ఇటీవల అద్దంకి శాసనసభ్యులు

గొట్టిపాటి రవికుమార్ అమెరికా నుండి తిరిగొస్తున్న సందర్భంగా "నీతి నిజాయితీలకు మారుపేరు, ప్రగతి ప్రదాత ఐనట్టి మా ప్రియతమ శాసనసభ్యులు శ్రీ గొట్టిపాటి రవికుమార్‌గారికి స్వాగత సుమాంజలులు. అంటూ నియోజకవర్గ ప్రజలు, ప్రముఖులు, అధికార్లు, నాయకులు, కార్యకర్తలు పత్రికల నిండా గుప్పించిన ప్రకటనలే రవికుమార్ నీతి, నిజాయితీ, క్రియాశీలతను చాటుతున్నాయ్. ప్రజల హృదయాలలో ఆయనకు గల స్థానాన్ని తెలిజేస్తున్నాను. ఇది ఎంతైనా, ఎవరికైనా హర్షదాయకమే.

ఎందుకంటే రాజా– కనిమొళి – గాలి సోదరులు వంటి మిక్కిలి తెలివి, చురుకుదనం కలిగిన యువకెరటాలు అవినీతి అక్రమార్జనల దిశగా ఎగిసిపడుతున్న తరుణంలోనే – అదేస్థాయి తెలివి, చురుకు, దమ్మున్న మరో యువకిరణం రవికుమార్ ప్రజాసేవ, నీతి, నిజాయితీల దిశగా దూసుకుపోతూ, అతి చిన్న వయసులోనే పెదనాన్నను మించి కీర్తి ప్రతిష్టలార్జించటాన్ని, అద్దంకి నియోజకవర్గ ప్రజలు ఆనందంగా స్వాగతిస్తున్నారు. అంతేగాదు అరుదుగా లభించే ఇలాంటి మంచి యువనాయకుని కాపాడుకోవాలని, అతన్ని మరింత ప్రోత్సహించుకుంటూ బలోపేతం చేసుకోవాలని నియోజకవర్గంలోని పెద్దలు, మేధావులు ఆసక్తిగా చర్చించుకుంటున్నారన్న వార్తలు వెలువడుతున్నాయ్. నిజంగా ఇవి అభిలషణీయం, సమాజానికి ఆరోగ్యదాయకం, శుభపరిణామం గూడ.

నిరంతరం ఇన్నివనులలో మునిగితేలుతున్నా చిన్న అవినీతి మరక గూడా అంటకుండా, నిర్మలంగా సాగిపోతున్న రవికుమార్ నిజాయితీకి ప్రతి పక్షాలవారు సైతం ముక్కున వేలేసుకుంటున్నారు. అందుకే ఈయన ఎదిగే సూర్యుడు. అంటే ఉదయభానుడు మన రవికుమార్. అంటూ పలువురు మురిపెంగా చెప్పుకుంటుఆన్నరు. ఆ మాట వాస్తవం అంటున్నారు అనుభవజ్ఞులు. అలా, అతిస్వల్పకాలంలోనే అద్దంకి నియోజకవర్గ అశేష ప్రజల ప్రేమాభిమానాలను పుష్కలంగా పొందగలిగారు చిరంజీవి రవికుమార్.

అదిగో ఆ ప్రేమాభిమానాలతోనే ప్రజలు ఏటేటా ఘనంగా జరుపుకుంటున్నారు రవికుమార్ జన్మదినోత్సవాన్ని. నవంబరు 9న ఆయన స్వగృహంలో జరిగే ఈ వేడుకకు దూరభారం, వ్యయప్రయాసలు అనుకోకుండా నియోజకవర్గంలోని అన్ని గ్రామాలనుండి అక్కడికొస్తారు ప్రజలు. తమ ప్రేమాభిమానాలను పొదిగి తెచ్చిన పూలు, పళ్ళు, దండలు, కేకులు, స్వీట్లుతో ఆయనకు శుభాకాంక్షలు, శుభాశీస్సులు అందించి వెళుతుంటారు. నిజంగా అద్దంకి నియోజకవర్గ ప్రజలు మిక్కిలి అభినందనీయులు. ఎందుకంటే, అలాంటి మంచి నాయకులు మనకోసం, సమాజంకోసం చేస్తున్న సేవలను గుర్తుంచుకోవడం, అందుకు వారిని గౌరవించుకోవడం "వెలుగుతున్న ప్రమిదలో మనవంతు కొంత చమురుపోసి ఆ జ్యోతిని మరింత ప్రజ్వలింపచేసుకోవడమే" ఇది ప్రతిఒక్కరి సామాజిక బాధ్యత గూడ. అదిగో ఆ బాధ్యతను గుర్తించినందుకే అద్దంకి నియోజకవర్గ ప్రజానీకాన్ని మరీ మరీ అభినందిస్తున్నాను.

అద్దంకి నియోజకవర్గ ప్రజల ఆశలు, ఆకాంక్షలు నెరవేర్చేందుకు మరింతగా శ్రమిస్తూ వారందరి హృదయాలలో ఇలాగే 'నిజాయితీపరుడైన ఒక మంచి, అపూర్వ ప్రజానాయకునిగా కలకాలం చిరంజీవిగా రవికుమార్ నిలచిపోవాలని మనసారా ఆకాంక్షిస్తూ ఆశీర్వదిస్తున్నాను. అందుకు అవసరమైన శక్తియుక్తులను వినయ విధేయతలను, ఓర్పు, నిగ్రహాలను, ఆయురారోగ్య ఐశ్వర్యాలను చిరంజీవి రవికుమార్ గారికి ఆ పరమేశ్వరుడు సర్వదా ప్రసాదించుగాక. తథాస్తు.

**అద్దంకి నియోజకవర్గానికి అతిస్వల్పకాలంలోనే రవికుమార్ సాధించిన వాటిలో హైలెట్స్‌గా చెప్పుకోదగిన పనులు...**

1. అద్దంకిలో పాలిటెక్నిక్ కళాశాలను మంజూరు చేయించారు.
2. సంతమాగులూరు, బల్లికురవలకు మూడేసి కోట్ల రూపాయల నిధులతో రెండు మోడల్ స్కూళ్ళను తెరిపించారు.
3. ఏళ్ళతరబడి ఎదురుచూస్తున్న కరెంట్ డి.ఇ. కార్యాలయాన్ని చీరాల నుండి అద్దంకి రప్పించారు.
4. అద్దంకిలో ఫైర్‌స్టేషన్ నిర్మాణానికి అనుమతిని సంపాదించారు.
5. 15 కోట్ల నిధులతో అద్దంకిలో 130 కె.వి కరెంట్ సబ్ స్టేషన్ నిర్మాణానికి పర్మిషన్ సంపాదించారు.
6. అద్దంకిని మున్సిపాలిటీగా అభివృద్ధి పరచేందుకు కృషిచేశారు.
7. గుండ్లకమ్మ ప్రాజెక్టు ముంపు బాధిత గ్రామాల వారి పునరావాస భూముల సేకరణ అసాధ్యంగా మారిన తరుణంలో రంగంలోకి దిగిన రవికుమార్ ప్రభుత్వాన్ని ఒప్పించి, రాష్ట్ర చరిత్రలోనే తొలిసారిగా దేవాదాయశాఖ భూములు పునరావాసానికి ఇప్పించగలిగారు.
8. ఉప్పుమాగులూరు, తంగేడుమల్లి వద్ద 1200 ఎకరాలకు సాగునీరందించగల రెండు భారీ చెక్‌డ్యాములు నిర్మిస్తున్నారు.
9. గత ఐదు సంవత్సరాలలో వివక్షకు గురై నష్టపోయిన 2500 మంది వృద్ధులు, వితంతువులకు తిరిగి పెన్షన్లు మంజూరు చేయించగలిగారు.

# ఆంజనేయస్వామి భారీ విగ్రహ నిర్మాణానికి శంకుస్థాపన




శింగరకొండ సమీపంలో అయ్యప్ప స్వామి దేవాలయం వద్ద 81 అడుగుల ఎత్తుతో భారీ శ్రీ అభయాంజనేయస్వామి విగ్రహం ఏర్పాటుకు శంకుస్థాపన కార్యక్రమాలు నిర్వహించారు. విగ్రహం దిగువ భాగాన దేవాలయాన్ని నిర్మించనున్నారు. సుమారు 1.5 కోట్ల రూపాయల వ్యయంతో స్వామివారి విగ్రహం నిర్మాణం శ్రీ ప్రసన్నాంజనేయ సేవా సంఘం ట్రస్టు ఆధ్వర్యంలో చేపట్టనున్నారు. శంకుస్థాపన పూజా కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే రవికుమార్ హాజరై శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఉదయం నుంచే సిద్ధాంతి అనిల్ కృష్ణభట్టాచార్యులు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజాకార్యక్రమాలు నిర్వహించారు. బ్రహ్మకుమారీస్ ఈశ్వరీయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రదర్శనను ఎమ్మెల్యే తిలకించారు. శంకుస్థాపన కార్యక్రమంలో కమిటీ అధ్యక్షులు గట్టుపల్లి రామారావు, కార్యదర్శి దామా హనుమంతరావు, గౌరవ అధ్యక్షులు సందిరెడ్డి రమేష్, ఇంజనీర్ శ్రీనివాసరావు, కమిటీ సభ్యులు లహరి, రామిశెట్టి రవి, ఎల్ఐసీ డీవో రామకృష్ణ, నాగసూరి హనుమత్ ప్రసాద్, కొత్తమాసు చంద్ర, దేవతు మహనంద, ఒంగోలు బీఎంఆర్ జ్యూయలరీస్ యజమాని శంకరరావు, శ్రీశైలం దేవస్థానం ట్రస్టు బోర్డు కమిటీ సభ్యులు పలగాని యలమందారెడ్డి, సందిరెడ్డి శ్రీనివాసరావు, కరి పరమేష్, కాకాని రాధాకృష్ణమూర్తి, నర్రా నాగేశ్వరరావు, కొమ్మాలపాటి బ్రహ్మేశ్వరరావు, ఏఎంసీ ఛైర్మన్ పులికం కోటిరెడ్డి, సీఐ గట్టమనేని శ్రీనివాసరావు, ఎస్సైమల్లిఖార్జునరావు,మాజీ ఎంపిపీ అన్నెం అంజిరెడ్డి, కె.వి.సుబ్బారావు, కోట శ్రీనివాసరావు, నాదెండ్ల దశరధరామయ్య, అన్నాబత్తిన సుబ్బయ్య పాల్గొన్నారు. వర్షాన్ని సైతం లెక్క చేయకుండా భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు.

❋ ❋ ❋ ❋

# అమరజీవి పొట్టి శ్రీరాములు త్యాగం మరవలేనిది - రవికుమార్

ఆంధ్రరాష్ట్ర అవతరణ కోసం అమరజీవి పొట్టి శ్రీరాములు చేసిన త్యాగం మరువలేనిదని స్థానిక శాసనసభ్యులు గొట్టిపాటి రవికుమార్ పేర్కొన్నారు. మంగళవారం ఆంధ్రరాష్ట్ర అవతరణ సందర్భంగా యం.యల్.ఏ. రవికుమార్ కార్లస్టాండ్ వద్ద నున్న పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన ప్రాణాలను సైతం లెక్కచేయకుండా తెలుగు భాష మాట్లాడే వారి అందరికోసం ప్రత్యేక రాష్ట్రం యొక్క యేర్పాటుకు ప్రాణాలను సైతం త్యాగం చేసిన అమరజీవి పొట్టి శ్రీరాములు అని యం.యల్.ఏ. రవికుమార్ పేర్కొన్నారు. ఆయన జీవితం నేటి తరానికి ఆదర్శం అని అన్నారు. ఈ కార్యక్రమంలో తహశీల్దారు ఆర్. ప్రభాకర్ రావు, ఎమ్.పి.డి.ఒ. జి. సాంబశివరావు ఎఎమ్‌సి ఛైర్మన్ పులికం కోటిరెడ్డి అద్దంకి తాజా మాజీ సర్పంచ్ చెన్నుపల్లి వెంకటేశ్వర్లు, జడ్‌పిటిసి సందిరెడ్డి శ్రీనివాసరావు, పిడిసిసిబ్యాంకు డైరెక్టర్ సందిరెడ్డి రమేష్, చుండూరి మురళీ సుధాకర్, గ్రంధి సుబ్బారావు, కరి పరమేష్, గునుపూడి రఘురాం గుప్తా తదితరులు పాల్గొన్నారు.






అద్దంకి శాసనసభ్యులు
**శ్రీ గొట్టిపాటి రవికుమార్ గారికి**
జన్మదిన శుభాకాంక్షలు....
**VNS సిని కాంప్లెక్స్, అద్దంకి.**

# నటనారంగంలో కలికితురాయి

## బండారు రామారావు

నాటకరంగం

బండారు వర్థంతి సందర్భముగా....




ఆయన రంగస్థలంపై గళం విప్పిపాడుతుంటే ప్రజలకు సూర్యోదయం తెలియదు. తన సంగీతంతో ఆంధ్రదేశాన ఆబాలగోపాలాన్ని ఉర్రూతలూగించి తనదంటూ ఒక ప్రత్యేక బాణీని ఏర్పరచుకొన్న అభినవ హరిశ్చంద్రుడు, గానగంధర్వుడు, నటచూడామణి స్వర్గీయ బండారు రామారావు. ఆయన గానామృతం, నటనా వైదుష్యానికి మంత్రముగ్ధులు కాని వారుండరు. తరాలు మారుతున్నా వన్నె తరగని దివ్య యశ్చంద్రిక, రస భావానుగుణ నటనా వైదుష్యం, శ్రుతి హితమైన చక్కటి వాచికంతో ప్రేక్షకుల హృదయాంతరాళాలలోకి ప్రవహించిన సంగీత ఝరి బండారు. సుందర స్వరూపం, సుమధుర గాత్రం రామారావుకు పుట్టుకతో సిద్ధించాయి. గ్రామ సీమల్లో రసజ్ఞులు నాటక సందర్శన కోసం నిరీక్షించిన బంగారు యుగమది. ఆ యుగంలో బండారుది ఓ విశిష్ట స్థానం. 1932 ఆగస్టు 12న అద్దంకిలో పేద కుటుంబంలో జన్మించిన బండారు రామారావు తన బాల్యంలోనే షేక్ షబ్బీర్ శిష్యరికం చేసి మెలుకువల్ని నేర్చుకున్నాడు. రేబాల రమణ, చీమకుర్తి రామస్వామి వంటివారితో 'శ్రీ రామా నాట్యమండలి' ని స్థాపించారు. పౌరాణిక నాటక రంగంలో శ్రీరామ, శ్రీకృష్ణ, నారద, భక్త కబీర్, బిల్వమంగళమొదలైన ఎన్నో పాత్రలను బండారు పోషించినప్పటికీ నవరసాలను ఆవిష్కరించి ప్రశంసలు, కీర్తిని తెచ్చి పెట్టింది మాత్రం సత్యహరిశ్చంద్ర పాత్ర అనడంలో సందేహం లేదు. శ్రోతల స్థాయి ఎరిగి, వేదిక విలువ తెలుసుకొని పండిత పామర జనరంజికంగా ఆయన నటన సాగేది. హిందూస్థానీ, కర్నాటక, ఒక్కొక్కచోట జానపద బాణీలుకరుణ రస సన్నివేశాలు ఆయన స్వరంలో కొత్త చమత్కారాలు సంతరించుకొనేవి. వేళ్ళ కదలిక ఒక ప్రత్యేకత. అబ్బూరి వారి తరువాత కళ బండారు పక్కకే చేరింది.

ఆంధ్రదేశంలోని అగ్రశ్రేణి నటీనటులతో ధీటుగా వేలాది ప్రదర్శనలు ఇచ్చారు. తన బాణీలను అనుసరిస్తున్న ఏకలవ్య శిష్యులు ఎందరినో బండారు ఆదరించారు. గుంటూరు జిల్లా చెరుకుపల్లి పోటీలలో 18 మంది శ్రీకృష్ణ పాత్రల పోటీలో ప్రథమ బహుమతిని పొందారు. నవయుగకవి గుర్రం జాషువా బండారుకు 'నటచూడామణి' బిరుదునిచ్చి సత్కరించారు. 1970లో బెంగుళూరు టౌన్‌హాల్‌లో ఆయన నటనకు ముగ్ధులైన ఎందరో ఆయన మన తెలుగువారు అని చెప్పుకునేందుకు గర్వపడ్డారు. రంగస్థల నటులు పుట్టంరాజు శంకరరావు, రమణారెడ్డి, అద్దంకి హేమలత, అద్దంకి ఆంజనేయరాజు, మెల్లంపూడి వెంకటేశ్వర్లు అతనికి సన్నిహితులు. అద్దంకి ప్రాంతానికి వన్నె తెచ్చిన బండారు యశస్సు ఒక్కటే వెంటవస్తుందని నమ్మేవారు. తల వంచి బ్రతకడం చేతకాని బండారు మరణానికి తలవంచి మౌనంగా వెళ్ళిపోయారు. ప్రతి క్షణం ముసురుతున్న కాలపు పొరలు అడ్డు వస్తున్నా ఆత్మీయులు తలచుకొంటే సుకలుకుల భాష్ప బిందువుల్లో ఆయన దర్శనమిస్తాడు. కాకిగా పుట్టి కోకిలలా బ్రతికి, రాయిలో పుట్టి రత్నమై వెలసి, పేదవారింట పుట్టిన బండారు మనవాడవడం అందరూ గర్వించదగ్గ విషయం. నటన కేవలం ధనార్జన కోసం కాక లోక కళ్యాణానికి ఉపయోగించాలని ఆయన కోరుకున్నాడు. నాటికీ, నేటికీ బండారు ప్రజల మనస్సుల్లో మెలుగుతూనే ఉన్నాడు. నాటక రంగంలో కొత్త అధ్యాయాన్ని సృష్టించిన అజేయుడు. తన నటనతో తాను పుట్టిన అద్దంకి గడ్డకు ఆంధ్రదేశంలోనే గుర్తింపు తెచ్చిన ఆ మహానటుని కళను భవిష్యత్ తరాలకు అందించడం ప్రతి కళాభిమాని కర్తవ్యం.

**భాష కందనట్టి భావాలు చూపించి**
**గానమునకు నవ్య కళలు గూర్చి**
**మతులలోన తీపికతలను మిగిలించి**
**అరిగినాడు రాముడమర పురికి...**

వాస్తు

# ప్రయాణములు – మంచి చెడులు



**గంటా సాయిబాబా,** వాస్తు పరిశోధకులు, సిద్ధాంతి.
సెల్ : 9848340130

***ప్రతిరోజు ప్రయాణము చేయువారు తిథి, నక్షత్రము, వారములు – వారశూలలు చెడు ప్రభావములు చూపవు. అయితే ప్రతిరోజు ప్రయాణం చేయువారు శకునములు (మంచి) చూచి ప్రయాణము చేయవలయును.***

***ముఖ్యముగా శుభకార్యములకు పోవువారు తీర్థయాత్ర లకు పోవువారు తప్పక తిథి, వార, నక్షత్ర, వారశూలలు పాటించి ప్రయాణము చేసిన మంచి ఫలితములు పొందగలరు.***

**వారశూలలు :**

| | |
|---|---|
| తూర్పునకు : | సోమ, శనివారములు |
| ఆగ్నేయమునకు : | శనివారము, గురువారములు, |
| దక్షిణమునకు : | గురువారము |
| నైఋతి నకు : | సోమ, శుక్రవారములు |
| పడమరకు : | ఆదివారము, శుక్రవారములు. |
| వాయివ్యమునకు : | ఆదివారము, మంగళవారములు |
| ఉత్తరమునకు : | మంగళ, బుధవారములు |
| ఈశాన్యమునకు : | బుధవారములు. |

కావున ఆయా దిక్కులకు ప్రయాణము చేయరాదు.

**శూలలకు శాంతి విధానము :**

తప్పనిసరిగా ప్రయాణములు చేయవలసి వచ్చినప్పుడు తూర్పునకు : పెరుగు, దక్షిణమునకు : నూనె, పడమరకు : బెల్లము, ఉత్తరమునకు : పాలు కాని, నెయ్యి కాని బ్రాహ్మణునికి దానము ఇచ్చిన యెడల కొంత వరకు శూల దోషములు హరించును.

**నక్షత్ర శూలలు :**

తూర్పునకు : జేష్ఠ, ధనిష్ఠ నక్షత్రములు
దక్షిణమునకు : శ్రవణ, అశ్వని నక్షత్రములు
పడమరకు : పుష్యమి, రోహిణి నక్షత్రములు



ఉత్తరమునకు : హస్త, ఉత్తర నక్షత్రములు శూల నక్షత్రములు

అయితే వేకువజామున 3 గంటల నుండి 5 గంటలలోపు ప్రయాణములు చేసిన శూల దోషములు ఉండవు.

**పూర్తిగా ప్రయాణమునకు నిషిద్ధములు (పనికిరానివి) :**

చవితి ఆదివారం, సప్తమీ సోమవారము, విదియ మంగళవారము, అష్టమీ గురువారం, తదియ శుక్రవారము, షష్టి శనివారములు, దగ్ధయోగములు కావున ఆయా తిథివారములు యందు ఎంత అవసరకార్యమైనను ప్రయాణము చేయరాదు.

**ప్రయాణమునకు చూసుకోవలసిన తిథులు :**

| | |
|---|---|
| శుక్లపాడ్యమి : | శరీర కష్టము, |
| బహుళ పాడ్యమి : | శుభము, జయము, |
| విదియ, తదియ : | ధనలాభములు |
| చవితి : | భయము, కష్టములు, |
| పంచమి : | అనుకూలము, |
| షష్టి : | కలహములు, |
| సప్తమీ : | సౌఖ్యము, |
| అష్టమి, నవమీ, దశమీ : | కష్టములు, నష్టములు, |
| ఏకాదశి : | కార్యసిద్ధి, శుభము. |
| ద్వాదశి : | దగ్ధయోగము, |
| త్రయోదశి : | అనుకూలము, |
| చతుర్ధశి : | మధ్యమము, |
| పూర్ణిమ, అమావాస్య : | ప్రాణ భయము, |

శుభా, అశుభములు కలుగును.

**నష్టతిథులు :**

| | |
|---|---|
| తూర్పునకు : | పాడ్యమి, నవములు |
| ఆగ్నేయమునకు : | తదియ, ఏకాదశిలును |
| దక్షిణమునకు : | పంచమీ, త్రయోదశి |
| నైఋతినకు : | చవితి, ద్వాదశిలును |
| పడమరకు : | షష్టి త్రయోదశి చతుర్ధశిలు |
| వాయువ్యమునకు : | సప్తమీ, పూర్ణిమలు |
| ఉత్తరమునకు : | విదియ, దశమీలూ |
| ఈశాన్యమునకు : | అష్టమీ, అమావాస్యలును |

ప్రయాణ నష్టములు కలుగ చేయును.

**ప్రయాణమునకు మంచి నక్షత్రములు :**

అశ్వని, మృగశిర, పునర్వసు, పుష్యమీ, హస్త, అనూరాధ, మూల, శ్రవణము, ధనిష్ట రేవతి నక్షత్రములు ప్రయాణమునకు మంచివి. రోహిణి, ఉత్తరాభాద్ర నక్షత్రములు మధ్యమము.

❄ ❄ ❄ ❄ ❄ ❄ ❄



# తిరుక్కుఱళ్ - శ్రీవాణి

- డాక్టర్ గాలి గుణశేఖర్
ప్రిన్సిపల్, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, అద్దంకి. సెల్ : 9618612495



## 16. సహనం

**151. త్రవ్వు వాని నైన ధర మోసెడు భంగి
ఒరులు నిందజేయ నోర్వనగును**
తనను కుళ్ళబొడిచి పలురకాలుగా హింసిస్తున్న వారిని సైతం భూమి సహనంతో మోస్తున్నట్లే, తనను నిందిస్తున్న జనుల పట్ల ఓర్పును చూపడం ఉత్తమ లక్షణం.

**152. ఒరు లపకృతి జేయ నోర్వంగ నగును
మరువ నంతకంటె మంచియగును**
హద్దు మీరి చేసిన అపకారాన్ని సైతం సహించగలగాలి. మరచి పోవడం అంతకంటె శ్రేష్ఠం.

**153. లేమి యన నతిథికి లేదను నిరసన
ఓగొనర్చు కీడు నోర్వ బలము**
అతిథుల్ని ఆదరించక నిరసించడమే కటిక దారిద్ర్యం. మూర్ఖులు తలపెట్టే కీడును సహించడమే బలం.

**154. నెరవుగోరు నరుడు నిశ్చలముగ నోర్మి
కలిగి యుండ వలయు నిల నుతింప**
మంచి గుణాలన్నీ తమలో ఉండాలని భావించేవారు.ప్రపంచ జనులు కీర్తించే విధంగా సహనం కలిగి ఉండాలి.

**155. మరువ దగును నింద; మది నోర్మి నెప్పుదు
కాంచనంబు భంగి కావదగును**
తమకు కీడు చేసిన వారిని, నిందించిన వారిని మన్నించడం మేలు. బంగారాన్ని ఎంత జాగ్రత్తగా రక్షిస్తామో, అంత భద్రంగా సహనాన్ని మనసులో కాపాడాలి.

**156. ఎగ్గుకెగ్గుసేయ నెసగెడు నానంద
మల్ప, మోర్మి యొకటె నిల్పు కీర్తి**
తమకు హాని తలపెట్టిన వారిని దండించడం ద్వారా కలిగే ఆనందం కొంత సమయమే ఉంటుంది. కాని సహించిన వారికి ఆనందం జీవితాంతం ఉంటుంది. వారి కీర్తి మరణానంతరం కూడా నెలకొంటుంది.

**157. పరుల కీడు వలన బాధ నొందిన కూడ
ధర్మహాని జేయ దలపరాదు**
ఇతరులు చేసిన అపకారం వలన ఇబ్బందులపాలైనా, వారికి ఎటువంటి బాధకలుగుతుందో ఏమోనని భావించి, ధర్మం తప్పి ప్రవర్తించడం మానాలి.

**158. గర్వి చేటొనర్ప గనవచ్చు జయమును
సహనమను గుణము సహకరింప**
అహంకారి చేటుకలిగించినా, సహన మనే సద్గుణంతో అతణ్ని జయించ వచ్చు.

**159. ప్రల్లదము మితిమీరిన, నుల్లమోర్మి
గనిన వారు, పూతాత్ములు మునుల భంగి**
దుష్టుల నిందా వాక్యాలు మితిమీరినా, మనస్సులో సహనాన్ని పాటించేవారు మునుల వలె పవిత్రులైనవారు

**160. తినక తపమొనర్చెడువారు ఘనులె, కాని
విరస వాక్కు నోర్చెడువారి వెనుక వారె**
అన్నపానీయాలు గ్రహించక కఠిన తపస్సు చేసేవారు చాలా గొప్పవారు. కాని నిందలను భరించి సహనం పాటించే వారికంటె తక్కువైన వారే.

## 17. అసూయ

**161. మదిని ఈర్ష్యలేక మనుగడ సాగించు
నైజ మలవడుటయె నరుని కింపు**
మనసులో లేశమైనా ఈర్ష్య చెందకుండా జీవించాలి. అది సహజగుణంగా మలచుకోవాలి. అటువంటి జీవితమే శుభకరం.

**162. ఎవరి యెడను ఈసుపొడమ కున్న
దానికెనయగున దితరము లేదు**
ఎవరి పట్లనైనా ఈర్ష్య ప్రదర్శించని గుణం పొందిన వ్యక్తికి ఎల్లప్పుడూ సంతోషం ఉంటుంది. మరే సుగుణమూ దానికి సాటికాదు.

**163. ధర్మమును, పెంపును వీడదలచువాడె
పరుల పెంపును గని ఈర్ష్యపడెడు వాడు**
ఇతరుల సంపద చూసి ఆనందించక, అసూయ చెందేవాడు.ధర్మం-దాని వల్ల కలిగే అభివృద్ధిని వదిలిపెట్టాలని భావించేవాడు.

**164. దుఃఖ మీసు వలన తోచుటెంచి ఘనులు
ధర్మరహితములను తలపరెపుడు**
ఈర్ష్యకారణంగా లభించే ఫలితం దుఃఖం మాత్రమే. కనుక ఉత్తములు అసూయ చెంది ధర్మరహితమైన వాటిని ఆచరించరు.

**165. ఈసుమించు శత్రు వెందును లేదది
పగతు కన్న హాని కలగ జేయు**
ఈర్ష్య చెందినవారు పతనం కావడానికి మరో దుర్గుణం ఏదీ అవసరం లేదు. బలవంతుడైన శత్రువు కన్న అసూయ తీవ్ర అపకారం చేస్తుంది.

**166. పరుల కొసగ నీసు పడువాని చుట్టముల్
కూడ పొంద లేరు కూడు గుడ్డ**
ఇతరులకు దానం ఇవ్వడం చూసి బాధపడేవాని బంధువులు సైతం అన్న వస్త్రాలు లేక చెడుతారు.

**167. ఈర్ష్యనొందు వాని ఈసడించి కమల
అగ్రజన్మురాలి కప్పగించు**
అసూయాపరునిపై అసహ్యం చెంది లక్ష్మీదేవి తన అగ్ర సోదరి అయిన దరిద్ర దేవతకు అతడిని అప్పగిస్తుంది.

**168. ఈర్ష్య యనెడు పాప మిరవు గొన్న, సిరిని
చెరపు, తగని పనుల గరపు నదియె**
అసూయ అనే పాపం వ్యక్తిలో చోటు చేసుకుంటే, అతడి సంపదల్ని నాశనం చేస్తుంది. చెయ్యరాని పనుల్ని చేయిస్తుంది.

**169. ఈర్ష్య వలన పెంపు, నీర్ష్య లేమివలన
కీడు, పరిగణించి చూడ వలయు**
ఈర్ష్య చెందేవారికి పెరిగే సంపదలు, అసూయ లేని వాడికి కలిగే దరిద్రం పరిశీలించి చూడాలి. (అవి శాశ్వతం కావు. వాస్తవానికి ఈర్ష్యాళువుకు అభివృద్ధి ఉండదు. అసూయలేని వాడికి పతనం ఉండదు.

**170. ఈసు వలన పేర్మి, ఈర్ష్యలేమి వలన
గౌరవంబు లేమి నేర వెపుడు**
ప్రపంచంలో ఈర్ష్యపొందిన వారికి ఔన్నత్యం, ఈర్ష్య లేని వారికి గౌరవ హాని ఎన్నటికీ జరగవు.